بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadr.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 10

సంచిక : 29

వార్షిక చందా 600/-రూ॥

17 జులై 2025 క్రీ, శ. - 17 వఫా 1404 హి, శ.

21 ముహర్రం 1447 హి,ఖ.

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

ھُوَالَّذِیۡ جَعَلَ لَکُمُ الَّیۡلَ
لِتَسۡکُنُوۡا فِیۡہِ وَالنَّھَارَ مُبۡصِرًا ؕ
اِنَّ فِیۡ ذٰلِکَ لَاٰیٰتٍ لِّقَوۡمٍ یَّسۡمَعُوۡنَ

(سورۃ یونس، آیت68)

**అనువాదం:** మీరు విశ్రాంతి పొందుటకు రాత్రిని చేసినవాడే అతడు. పగులును ప్రకాశింప జేయునట్టిది చేసెను. (మాటలు) విను వారి కొరకు దీనిలో నిశ్చయముగా వలు సంకేతములు ఉన్నవి.

**(యూనూస్: 68)**

**దేవుడు ఎవరిపైనైన తన అనుగ్రహాన్ని కురిపించదల చినచో సాధారణముగా ప్రజల హృదయాలలో అతనిపట్ల ప్రేమా భిమానాలను కల్గిస్తుంటాడు.**

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:**

నేను మీకు తెల్పు సత్యమేమనగా, తల్లి దండ్రులను వదిలి పెట్టిన వారెవ్వరు కూడ శుభములను పొందలేరు. కావున సదుద్దేశంతో, సద్భావనతో పూర్తి వినయ విధేయతలను ప్రదర్శిస్తూ అల్లాహ్ మరియు అతని ప్రవక్త (స) భోధనలకు అనుగుణముగా నడుచుకొనుటకు సిద్ధముగా ఉండుము. వినక పోయినచో మీఇష్టం. నచ్చజెప్పడం మా బాధ్యత.

నా జమాఅత్ సభ్యులకు నేను చేయు ఉపదేశమే మనగా, అరబి భాషను నేర్చుకోండి. ఎందుకనగా అరబి భాష పరిజ్ఞానం లేకుండా ఖుర్ఆన్ మజీద్‌ను అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. కావున అనువాదంను చదవడం కొరకు, సాధ్యమైనంత మేరకు కొంచం కొంచంగా అరబి భాషను నేర్చుకోవ డానికి ప్రయత్నించాలి. నేటి కాలంలో అరబి భాషను నేర్చుకో వడం కొరకు చాలా సులువైన మార్గాలు వెలుగులోకి వచ్చాయి. ఖుర్ఆన్ మజీద్ పారాయణం చేయడం ప్రతి ముసల్మానుడి కర్తవ్యం. అలాంటప్పుడు అరబి భాషను నేర్చుకోకుండా, జీవితమంతయు ఆంగ్లం మరియు ఇతర ఇతర భాషలను నేర్చుకుంటున్నచో దాని అర్థవేమిటి?. కాని ఇక్కడ గుర్తుంచు కోవలసిన విషయమేమనగా, ఇప్పుడున్నటు వంటి ప్రభుత్వం ఒక జాతిరూప ప్రభుత్వంగా ఏర్పడింది. కావున అట్టి జాతీయ ప్రభుత్వపు భాష కూడ జాతీయభాషగానే గుర్తింపు పొందు తుంది. కావున మీరు మీ భావాలను, ఆలోచనలను పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి తెలియజేయడం కోసం ఆంగ్ల భాషను నేర్చుకోండి, ఆపై మీరు ప్రభుత్వంతో ప్రయోజనం పొందండి, ప్రభుత్వానికి మీరు సహకారాన్ని అందించండి.

దైవాదేశమే లేనిదే ఎవరికి ఎలాంటి ఇబ్బంది కల్గదు. దైవ సందేశహరులకు కూడ ఇబ్బందులు ఎదురైనాయి. కాని అవి ప్రేమారూపంను దాల్చి ఉంటాయి. వాటిలో ఒక విధమైన బోధనలు దాగి ఉంటాయి. ఆ కష్టకాలంలో దైవ ప్రవక్తలను అనుసరించు పవిత్ర అనుచర వర్గం తమ ఆచరణ, నడవడికల ద్వారా ఆ బోధనలను తెలియపరుస్తుంటారు. కాని కొందరికి దరిద్రం పట్టుకుంటుంది. అది వారు చేసుకున్న కృతాపరాధ ఫలితమే. మన్య్యఅమల్ మిస్ఖాల జర్రతిన్ షర్రయ్యరహు (జిల్‌జాల్:9) కావున మానవుడు ప్రాయశ్చిత్తం, పాశ్చాత్తాపం చేసుకుంటు ఉండాలి. అంతేగాక దుష్కార్యములు హద్దులు మీరకుండా చూసుకుంటూ ఉండాలి. లేనిచో దేవుని ఆక్రోషానికి బలైపోతారు.

దేవుడు ఎవరిపైనైన తన అనుగ్రహాన్ని కురిపించదల చినచో సాధారణముగా ప్రజల హృదయాలలో అతనిపట్ల ప్రేమా భిమానాలను కల్గిస్తుంటాడు. కాని ఎప్పుడైతే మానవుడు తన దుష్కార్యములలో హద్దులు మీరుతాడో అప్పుడే ఆకాశంపై అతనికి వ్యతిరేక గాలులు వీచును, ఆపై అల్లాహ్ తాలా అభిష్టము మేరకు ప్రజల హృదయాలు కఠినముగా మారును. అప్పుడు వెంటనే ప్రాయశ్చిత్తం, పాశ్చాత్తావం చెందుతూ దేవుని సన్నిధిలో మోకరిల్లుచూ ఆభయమును కోరుకున్నచో లోలోననే మరల కనికరం పుట్టకొచ్చును. ప్రజల హృదయాలలో అతని పట్ల ప్రేమాభిమానపు భీజం వేయబడుననే విషయం ఎవరికి తెలియదు. మొత్తానికి ప్రాయశ్చిత్తం, పాశ్చాత్తాపంలు వ్యర్థం కానటువంటి ఔషదాలు.

**బాహ్యా కారణాలు కూడ దైవశిక్షపట్ల భయభ్రాంతులకు గురి చేయును. దేవుడు ఎల్లప్పుడు సందర్భాను కూలముగానే శిక్షించును.**

యూనూస్ అధ్యాయానికి చెందిన 55వ సూక్తిని విశ్లేషిస్తూ సయ్యిది నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహు స్సాని రజియల్లాహు అన్హు ఇలా తెల్పుచు న్నారు: మానవుని స్వభావం ఎలాంటి దనగా, అది శిక్షను రెండు రకాలుగా ప్రభావితం చేసుకుంటుంది. అనగా శిక్షించడం వలన కొందరు వ్యక్తులు అహంను ప్రదర్శిస్తూ ఎదుర్కొనుటకు ప్రయత్ని స్తుంటారు, మరికొందరు క్రుంగిపోతారు. కాని అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. మేము విధించే శిక్షలు అనుమా నస్పదముగా ఉండవు. అది తప్పకుండా తన ప్రభావనం చూపిస్తుంది. మేము విధించే శిక్షలకు ఎంతటి వారలైన తట్టుకోలేక పెడబొబ్బలు పెడుతుంటారు. ఎవరిలో కూడ అహం మిగిలి ఉండదు. అందుకు కారణం ఏమిటనగా, మానవులు విధించే శిక్షలు శరీరాన్ని ప్రభావితం చేస్తాయి కాని మనస్సును చలింప జేయలేవు. కేవలం పిరికి వారు మాత్రమే తమ బలహీన స్వభావం వలన భయభ్రాంతులకు గురవుతుంటారు. కాని అల్లాహ్ తాలా హృదయాలపై ఆధిక్యత గలవాడు. కావున అతని శిక్షలు కేవలం శరీరాన్నే కాకుండా మనస్సును కూడ చలింపజేస్తుంటాయి. ఈ విధముగా మనస్సును పవిత్రం చేయడం జరుగుతుంది. అందుకే అల్లాహ్ తాలా "మేము విధించే శిక్షలు హృదయాన్ని కూడ చలింపజేయునట్లు ఉంటాయని, అందుకే ఎవరినైతే శిక్షించడం జరుగుతుందో వారు అన్ని రకాల త్యాగాలను సమర్పించుకొని తమను తాము కాపాడుకొనుటకు సిద్ధముగా ఉంటారని" తెలిపాడు. బాహ్యా కారణాలు కూడ దైవశిక్షపట్ల భయభ్రాంతులకు గురి చేయును. దేవుడు ఎల్లప్పుడు సందర్భాను కూలముగానే శిక్షించును. అందువలనే అతని మనస్సు ఆ శిక్షకు ప్రభావిత మవుతుంది. మానవులు విధించే శిక్షలలో తప్పిదాలు ఉంటాయి. కావున వారికి విధించే శిక్ష దౌర్జన్య పూరితమని వారు భావించి నప్పుడు వారి మనస్సులు ఎదురించడానికి సిద్దపడుతాయి.

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

■ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జాబిర్ రజి ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: ఒక మహిళ పిల్లి కారణంగా శిక్షించబడింది. ఆ పిల్లిని ఆవే బంధించింది. అందువలన ఆ పిల్లి ఆకలి తో చనిపోయింది. ఆమే ఆ పిల్లి కారణంగా నరకంలో పడిపోయింది. హుజూర్ (స) మరల ఇలా తెలిపారు. నీవు దానిని బంధించావు. దేవునికి సర్వం తెలుసు. నీవు దానికి తినిపించలేదు, త్రాపించలేదు, దానిని వదిలి పెట్టలేదు. వదిలినచో అది భూమిపై దొరికిన వాటిని తింటూ ఉండేది. (అని ఆమేను అడిగారు)

■ హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. ప్రళయదినమున అల్లాహ్ తాలా ముగ్గురు వ్యక్తులతో మాట్లాడడు. వారి వైపు కనికరంతో చూడడు. వారిలో ఒకరు తన వ్యాపార సామాగ్రిని విక్రయించడం కోసం ఇప్పుడు మీరు ఇచ్చిన దానికంటే ఎక్కువ ధర వచ్చేదని అబద్ధపు ప్రమాణం చేసేవాడు. మరొకరు అసర్ నమాజ్ తరువాత ఇతర ముసల్మానుల సంపదను కాజేయుటకు అబద్ధపు ప్రమాణం చేయువాడు. మరొక వ్యక్తి తనకు అవసరం లేకున్నా నీటిని అడ్డుకట్టవేసి ఆపువాడు. అల్లాహ్ తాలా వారితో ఇలా అంటాడు. ఏ విధముగానైతే నీవు మిగిలిన, అది కూడ నీవు సృష్టించని నీటిని అడ్డుకున్నావో అదే విధముగా నేను కూడ ఈ రోజు నా అనుగ్రహం నీ వరకు చేరకుండా అడ్డుకుంటాను.

**(సహీ బుఖారి, సంపుటి 4, కితాబుల్ మసాఖాతు ప్రచురణ 2008 ఖాదియాన్)**

ఈ సంచికలో ...

**(1) 31 జనవరి 2025 నాటి జుమా ప్రసంగం ........ పేజి 2లో.**

**(2)దుఆల ప్రాధాన్యత...8 పేజిలో**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

గత జుమా ప్రసంగంలో జి ఖర్ద్ యుద్ధం ప్రస్తావన జరిగింది. ఈ యుద్ధానికి బయలుదేరడానికి ముందు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం తన సహచరులలో కొంతమందిని శత్రువు వైపు పంపారు. తరువాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం కూడా సైన్యం తీసుకోని బయలుదేరినారు. ఈ విషయంలో, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మరియు సహచరులు చేరుకోగానే, శత్రువు సైన్యం వీరిని చూసి పారిపోయింది.

---

హజ్రత్ సల్మా రజి ఇలా తెలిపారు. దైవ సల్లల్లాహు అలైహి వ సల్లం నాకు గుర్రపు సైనికులకు మరియు కాలినడకన పోరాడేవారికి వలే రెండు భాగాలను ఇచ్చారు. ఆ తరువాత హుజూర్ (స) తమ ఒంటెపై తమ వెనకాల స్వారీ చేయడానికి అనుమతి ఇచ్చారు.

---

మదీనా యూదులు అయినా, ఖైబర్ యూదులు అయినా, వారి కుట్రలు మరియు ద్రోహపూరిత కుట్రలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఇస్లాంకు వ్యతిరేకంగా చాలా ఎక్కువగా ఉన్నాయి. వారి తీవ్రమైన అసూయ మరియు శత్రుత్వం కారణంగా, వారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మరియు ఇస్లాంను పూర్తిగా నాశనం చేయడానికి ఏ అవకాశాన్ని కూడ వదిలిపెట్టలేదు.

---

ఇస్లాంకు వ్యతిరేకంగా మరియు ఇస్లాం వ్యవస్థాపకుడికి వ్యతిరేకంగా విషం చిమ్మడానికి ఎప్పుడూ సిగ్గుపడని ప్రముఖ విమర్శకుడు మోంట్‌గోమెరీ వాట్ తన పుస్తకంలో ఇలా వ్రాశాడు, దాని అనువాదం ఇలా ఉంది: "ఖైబర్‌పై దాడికి సరళమైన మరియు స్పష్టమైన కారణం ఏమిటంటే, వారు (అంటే, ఖైబర్ ప్రజలు) తమ వద్ద ఉన్నటు వంటి సంపదను ఖర్చుచేస్తూ పొరుగు తెగలను ముస్లింలతో యుద్ధం చేయడానికి ప్రేరేపించడం. "

---

ఖైబర్ యూదులు ముస్లిం సైన్యం రాక గురించి తెలుసుకున్నప్పుడు, వారి నాయకులు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు మరియు యూదు నాయకులలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమైనట్లు ప్రస్తావించబడింది.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 31 జనవరి 2024, ( 31 సులహ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

గత జుమా ప్రసంగంలో జి ఖర్ద్ యుద్ధం ప్రస్తావన జరిగింది. ఈ యుద్దానికి బయలుదేరడానికి ముందు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం తన సహచరులలో కొంతమందిని శత్రువు వైపు పంపారు. తరువాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం కూడా సైన్యం తీసుకోని బయలుదేరినారు. ఈ విషయంలో, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మరియు సహచరులు చేరుకోగానే, శత్రువు సైన్యం వీరిని చూసి పారిపోయింది. ముస్లింలు శత్రువుల శిబిరానికి చేరుకున్నప్పుడు, హజ్రత్ అబూ ఖతాదా రజి గుర్రం అక్కడ ఉంది మరియు అది కుంటుంతుంది. ఒక సహచరుడు, "ఓ అల్లాహ్ ప్రవక్తా! అబూ ఖతాదా గుర్రం కుంటినొప్పితో బాధపడుతుంది." అని అన్నాడు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాని పక్కన నిలబడి రెండుసార్లు ఇలా అన్నారు: "అయ్యో! యుద్ధంలో మీరు ఎంతమంది శత్రువులను ఎదుర్కొన్నారు!" ఆ తరువాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మరియు సహచరులు హజ్రత్ అబూ ఖతాదా రజి మరియు మస్అదా రజిలు కుస్తి యుద్ధం చేసిన ప్రదేశానికి చేరుకున్నారు. గత జుమాలో ఈ విషయం ప్రస్తావించబడింది. హజ్రత్ అబూ ఖతాదా రజి నేలపై, దుప్పటి కప్పుకొని పడుకున్నారని వారు భావించారు. ఒక సహచరుడు ఇలా అన్నాడు, "ఓ అల్లాహ్ ప్రవక్తా! అబూ ఖతాదా రజి హతమార్చబడినట్లున్నాడు.'

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా సమాధానమిచ్చారు: "అల్లాహ్ అబూ ఖతాదాను కరుణించుగాకా!. నాకు గౌరవం ఇచ్చిన దేవుని ప్రమాణం! అబూ ఖతాదా శత్రువులను వెంబడిస్తున్నాడు. సైనికుల ఉత్సాహాన్ని రేకెత్తించడానికి ద్విపదలు పఠిస్తున్నాడు."

హజ్రత్ అబూ ఖతాదా రజి ఇలా వివరిస్తున్నారు: "వారు అనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం సైన్యం నా గుర్రం వద్దకు చేరుకున్నప్పుడు అది కుంటుతూ , మరియు చనిపోయిన ఒక వ్యక్తి నా దుప్పటిలో చుట్టబడి ఉండడాన్ని చూసి, బహుశా నేను వీరమరణంను పొందానని భావించారు. హజ్రత్ అబూ బకర్ రజి మరియు హజ్రత్ ఉమర్ రజి త్వరగా ముందుకు వచ్చి, ఆ దుప్పటిని తీసిచూడగా, వారికి మస్'ఆదా గారి ముఖము కనిపించింది. వారిద్దరూ, "అల్లాహ్ గొప్పవాడు! దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం నిజం చెప్పారు. ఆపై ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇతను మస్'ఆదా." అని పలికారు. ఆ తరువాత, సహచరులు కూడా అల్లాహ్ వైభవాన్ని కొనియాడారు. కొద్దిసేపటి తరువాత, హజ్రత్ అబూ ఖతాదా రజి కొన్ని ఒంటెలను తనతో పాటు తీసుకోని వచ్చి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముందుకు చేరుకున్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా అన్నారు, "ఓ అబూ ఖతాదా! మీ ముఖము విజయంతో మెరిసిపోతుంది. అబూ ఖతాదా అశ్వికదళ అధిపతి. ఓ అబూ ఖతాదా! అల్లాహ్ మిమ్మల్ని ఆశీర్వదించుగాకా!. " మరొక కథనంలో, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా అన్నారు, "అల్లాహ్ మీ పిల్లలను మరియు మీ పిల్లల సంతానాన్ని ఆశీర్వదించుగాకా!." ఆ తరువాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా అన్నారు, "ఓ అబూ ఖతాదా! మీ ముఖానికి ఏమైంది?" హజ్రత్ అబూ ఖతాదా ఇలా అన్నారు: "నేను ఇలా జవాబిచ్చాను: 'నా తల్లి మరియు తండ్రిని మీకు అంకితమవ్వుదురు గాకా!. నాకు ఒక బాణం తగిలింది. మీకు గౌరవాన్ని అనుగ్రహించిన దేవుని ప్రమాణం! నేను దానిని తీసివేసానని అనుకున్నాను.' దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ద్వారా, 'ఓ అబూ ఖతాదా, నా దగ్గరికి రండి.' అని అన్నారు. అలా, నేను దైవ ప్రవక్త సల్లం దగ్గరికి వెళ్ళాను. అప్పుడు హుజూర్ (స) సున్నితంగా బాణాన్ని తీసివేసి, దానిపై తన లాలాజలం ఉంచి, ఆపై తన చేతిని దానిపై ఉంచారు." హజ్రత్ అబూ ఖతాదా రజి ఇలా చెబుతున్నారు: " ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రవక్తుత్వం అనుగ్రహించిన దైవం ప్రమాణం! ఆ తరువాత నాకు బాణం తగిలిన బాధగాని, గాయం కాని ఏమి అనిపించలేదు. గత జుమా ప్రసంగంలో హజ్రత్ అబూ ఖతాదా రజి స్వయంగా బాణాన్ని తీసివేసుకున్నట్లుగా ప్రస్తావించబడింది. అయితే, బాణం యొక్క కొన ఇంకా ఇరుక్కుపోయి ఉండవచ్చు, ఆ గుర్తు ఇంకా కనిపించడంతో ప్రవక్త దానిని తొలగించారు కావచ్చును. మరొక కథనంలో, ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం హజ్రత్ అబూ ఖతాదాను చూసినప్పుడు, "ఓ అల్లాహ్! అతని జుట్టు మరియు చర్మాన్ని దీవించండి" అని దుఆ చేసినట్లు కూడా నమోదు చేయబడింది. హుజూర్ (స) ఇంకా ఇలా అన్నారు. "మీరు విజయం సాధించారు". అందుకు హజ్రత్ అబూ ఖతాదా రజి కూడ 'ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు కూడ విజయం సాధించారు!' అని అన్నాను. హజ్రత్ అబూ ఖతాదా రజి 70 సంవత్సరాల వయసులో మృతి చెందినప్పుడు కూడ , వారి రూపురేఖలను చూసినచో వారు 15 సంవత్సరాల వయస్సులో ఉన్నట్లు అనిపించిందని చెబుతారు. అంటే,వారు రజి చాలా యవ్వనంగా కనిపించారు. **(సుబులుల్ -హుదా వా ర్రిషాద్, వాల్యూమ్. 5, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, 1993, పేజీ. 100-101)**

ఈ యుద్ధంలో, హజ్రత్ సల్మా రజి జుఖరద్ వద్ద శత్రువుతో పోరాడిన ప్రస్తావన ఈ క్రింది విధంగా కనిపిస్తుంది: హజ్రత్ సల్మా రజి ఇలా వివరిస్తున్నారు: "నేను శత్రువును చాలా పట్టుదలతో వెంబడిస్తున్నాను, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంకు గౌరవాన్ని ప్రసాదించిన అల్లాహ్ ప్రమాణం! నా వెనుక ఉన్న సహచరులను నేను చూడలేకపోయాను, వారి జాడ కూడా నాకు కనిపించలేదు. శత్రువు సూర్యాస్తమయానికి ముందు ఒక లోయకు చేరుకున్నాడు, అక్కడ జుఖరద్ అనే నీటి బుగ్గ ఉంది. వారు నీరు త్రాగడానికి ప్రయత్నించినప్పుడు, నేను ఇంకా వారిని వెంబడిస్తున్నానని వారు గమనించారు, కాబట్టి వారు దాని నుండి వెనక్కి తగ్గారు. అప్పటికి, సూర్యుడు అస్తమించాడు. నేను వారిలో ఒకరిని చూసినప్పుడు, నేను అతనిపై ఒక బాణం వేశాను. ఆ రోజు ఉదయం, నేను అతనిపై మరొక బాణం వేశాను. ఇప్పుడు నేను వేరొక బాణం వేశాను, రెండూ అతనిని తాకాయి. శత్రువు రెండు గుర్రాలను విడిచి పారిపోయాడు, నేను వాటిని పట్టుకున్నాను, ఆ సమయానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వచ్చారు, మరియు నేను పట్టుబడిన గుర్రాలను హుజూర్ (స) వద్దకు తీసుకెళ్లాను. "

**(సుబులుల్ -హుదా వర్రిషాద్, సంపుటి 5, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ 1993, పేజీలు 98-99)**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం జు ఖరద్‌కు చేరుకోవడం గురించి, హజ్రత్ సల్మా రజి ఇలా పేర్కొన్నారు, " నేను శత్రువులను అడ్డుకున్న ప్రాంతానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇషా సమయానికి చేరుకొని, అక్కడ శిబిరం వేశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఒంటెలను మరియు నేను శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న అన్నిటినీ స్వాధీనం చేసుకున్నారు. హజ్రత్ బిలాల్ రజి శత్రువు నుండి తీసుకున్న ఒంటెలలో ఒకదాన్ని వధించి, దాని కాలేయం మరియు మూపురం మాంసంను దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం కోసం కాల్చాడు. హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ రజి కూడా పది ఒంటెలపై ఖర్జూరాలు నింపి పంపించారు, వాటిని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం జు ఖరద్ వద్ద స్వాధీనపర్చుకున్నారు." హజ్రత్ సల్మా రజి ఇలా వివరించారు, "నేను శత్రువులను నీటి నుండి దూరంగా ఉంచానని చెప్పాను, మరియు వారు దాహంతో ఉన్నారు. దయచేసి నన్ను వంద మంది యోధులతో పంపండి, తద్వారా నేను వారిని వెంబడించి వారిలో ప్రతి ఒక్కరినీ చంపగలను అని అన్నాను. ఈ మాట విన్నప్పుడు, దైవప్రవక్త (స) ఆనందంతో నవ్వారు. మంటల వెలుగులో దైవ ప్రవక్త (స) శుభప్రదమైన దంతాలు కనిపించాయి. హుజూర్ (స) 'సల్మా మీరు దీన్ని చేయగలరని మీరు అనుకుంటున్నారా?' అని అడిగారు. అందుకు నేను 'మీకు గౌరవాన్ని కల్పించిన అల్లాహ్ ప్రమాణం! అవును, నేను చేయగలను' అని జవాబిచ్చాను." అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: **మలక్త ఫఅస్‌జిహ్** అనగా "మీరు వారిపై ఆధిక్యతను సాధించినప్పుడు వారిపట్ల దయ చూపండి." ఇది అరబ్ సామెత, అంటే క్షమాపణకు ఉత్తమ రూపం దయ చూపడం గాని, కఠినంగా వ్యవహరించడం కాదు అని అర్థం. అంటే వారు వెళ్ళిపోయి ఉంటే వారిని అలాగే వదిలేయండి. వారిని ఇక వెంబడించాల్సిన అవసరం లేదు.

ఈ యుద్ధ సంఘటనల గురించి హజ్రత్ సల్మా ఇలా అన్నారు. "ఉదయం దైవ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా అన్నారు:

'ఈ రోజు అశ్విక దళంలో అత్యుత్తముడు అబూ ఖతాదా, మరియు పదాతిదళంలో అత్యుత్తముడు సలామహ్ బిన్ అక్వా.'"

హజ్రత్ సల్మా రజి ఇలా తెలిపారు. దైవ సల్లల్లాహు అలైహి వ సల్లం నాకు గుర్రపు సైనికులకు మరియు కాలినడకన పోరాడేవారికి వలే రెండు భాగాలను ఇచ్చారు. ఆ తరువాత హుజూర్ (స) తమ ఒంటెపై తమ వెనకాల స్వారీ చేయడానికి అనుమతి ఇచ్చారు. ఈ ప్రయాణంలో హజ్రత్ సల్మా రజి గురించి మరొక కథనం ఉంది. హజ్రత్ సల్మా రజి ఇలా పేర్కొన్నారు. "మేము మదీనాకు తిరిగి వస్తున్నప్పుడు మదీనాకు సమీపంలో చేరుకున్నప్పుడు, అన్సార్లకు చెందిన వేగంగా పరిగెత్తే ఒక ప్రసిద్ధ అనుచరుడు 'నాతో పరుగు పందెంలో పోటి పడుటకు ఎవరైనా ఉన్నారా?' అని ప్రకటించాడు. అతను ఈ మాటలను చాలాసార్లు పునరావృతం చేశాడు." హజ్రత్ సల్మా ఇలా అన్నారు, "నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వెనుక తన ఒంటెపై స్వారీ చేస్తున్నాను. నేను అన్సార్ నుండి వచ్చిన ఆ సహచరుడిని ఇలా అడిగాను, 'మీరు గౌరవనీయులైన అనుచరులను గౌరవించరా?' అంటే, మీరు ఈ ప్రకటన చేస్తూ తిరుగుతున్నప్పుడు గౌరవనీయులైన అనుచరులకు ఎవరికీ భయపడటం లేదా?. అందుకు 'లేదు, నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం తప్ప మరెవరికీ భయపడను.'ఆయన ఇలా జవాబిచ్చారు. కాబట్టి నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంతో, "ఓ అల్లాహ్ ప్రవక్తా! సల్లల్లాహు అలైహి వ సల్లం, నా తల్లిదండ్రులు మీ కోసం అర్పించబడుదురు గాక!. నన్ను ఆయనతో పరుగెత్తడానికి అనుమతించండి" అని అడిగాను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం, 'సరే, మీరు పోటీలో పాల్గొనాలనుకున్నచో పాల్గొనవచ్చును' అని అనుమతినిచ్చారు. అప్పుడు నేను ఆ వ్యక్తితో, 'మనం పరుగెత్తుకుందాం' పదా అని అన్నాను." మరల అతను ఇలా అన్నాడు, "నేను నా కాళ్ళను వంచి, దూకడం, పరిగెత్తడం ప్రారంభించాను. మొదట్లో, నేను అతని కంటే ఒకటి లేదా రెండు అడుగులు వెనుక ఉన్నాను. అనగా అతను ముందు ఉన్నాడు మరియు నేను వెనుక ఉన్నాను, నా శక్తిని ఆదా చేసుకున్నాను. అప్పుడు, నేను నా వేగాన్ని పెంచి, అతనిని అధిగమించి, అతని భుజాల మధ్య నా చేతిని ఉంచి, 'అల్లాహ్ ప్రమాణం!, నేను నిన్ను ఓడించాను' అని అన్నాను. ఆయన నవ్వి, "మీరు చెప్పింది నిజమే కావచ్చు" అని అన్నారు. అలా, మేము మదీనా చేరుకునే వరకు నేను ముందు పరిగెత్తడం ప్రారంభించాను."

ఈ యుద్ధం కోసం ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మదీనా నుండి ఎన్ని రోజులు బయట ఉన్నారు అనే విషయాన్ని చూసినచో, ఆ వివరాలు ఇలా ఉన్నాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బుధవారం ఉదయం బయలుదేరినారు. హుజూర్ (స) శత్రువుల సమాచారం సేకరించడానికి జు ఖరద్‌లో ఒక పగలు మరియు ఒక రాత్రి బస చేశారు. తరువాత సోమవారం నాడు మదీనాకు తిరిగి వచ్చారు. అలా హుజూర్ (స) నగరం వెలుపల ఐదు రాత్రులు గడిపాడు.

ఈ యుద్ధంలో వీరమరణం పొందిన అనుచరుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ముసల్మానులలో, హజ్రత్ ముహ్రిజ్ బిన్ నజ్లా రజి అమరవీరులయ్యారు. ఇబ్న్ హిషామ్ ప్రకారం, ఇబ్న్ వకాస్ బిన్ ముజజ్జిజ్ రజి కూడా అమరవీరులయ్యారు. అదనంగా, హజ్రత్ అబూ జర్ రజి కుమారుడు యుద్ధానికి ముందు ఒంటెల కొట్టంలోనే అమరవీరులయ్యారు. అవిశ్వాసుల విషయానికొస్తే, 'అబ్దుర్ రెహ్మాన్ బిన్ 'ఉయైనా, హుబైబ్ బిన్ 'ఉయైనా, మస్'ఆదా బిన్ హకామా ఫజారీ, అవుబర్ మరియు అతని కుమారుడు 'అమర్ చంపబడ్డారని నమోదు చేయబడింది.

**(సుబులుల్ వర్రిషాద్, వాల్యూం.5, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, 1993, పేజీలు. 100-104) (ఉమ్దతుల్-ఖారీ, సంపుటి 14, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, బీరుట్, పేజి. 286.) (సుబులుల్ హుదా వర్రిషాద్ 5, దారుల్ కుతుబుల్ ఇల్మియత్, బీరూట్, పేజి 95)**

గతంలో హజ్రత్ అబూ జర్ రజి గారి భార్యను శత్రువులు బంధించారని ప్రస్తావించబడింది. దుండగులు ఆమెను బంధించి, కట్టివేసి, తమతో పాటు తీసుకెళ్లారు. ఆమెను బంధించిన వారు రాత్రిపూట వారి పశువులను వారి ఇళ్ల ముందు కట్టేసుకునే వారు. ఒక రాత్రి, ఆమె తన బంధనాల నుండి బయటపడి, ఆమె దగ్గర కట్టివేయబడిన కొన్ని ఒంటెల వద్దకు వెళ్ళింది. ఆమె వాటిలో ఒకదానిని సమీపించినప్పుడల్లా, అవి ఆందోళనతో అరుస్తుండేవి. అందువలల ఆమె ఆ ఒంటెలను విడిచిపెట్టినా కూడా అవి శబ్దం చేసేవి. ఆమె అలా అజ్బా ఒంటె వరకు చేరుకున్నది. అది దైవ ప్రవక్త (స) గారి ఒంటె – దానిని శత్రువులు ఎత్తుకొచ్చారు. నేను దాని వద్దకు చేరుకున్న కూడ అది ఎలాంటి అరుపులు అరువలేదు. లేదా శబ్దం చేయలేదు కానీ పూర్తిగా ప్రశాంతంగా ఉంది. అది బాగా మచ్చిక చేసుకున్న ఒంటె. ఆ స్త్రీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఒంటెపై ఎక్కి పారిపోయింది. ఆమెను బంధించిన వారు ఆమె తప్పించుకున్నట్లు తెలుసుకున్నప్పుడు, వారు ఆమెను మరల పట్టుకొని బంధించడానికి ప్రయత్నించారు కానీ వారు విఫలమయ్యారు.

ఈ కథనం యొక్క కథకుడు ఇలా తెలిపాడు. ఒకవేళ అల్లాహ్ తాలా ఆ స్త్రీని ఈ ఒంటె ద్వారా ఆమెను కాపాడినట్లయితే, ఫలితముగా ఆమె ఒంటెను బలి ఇస్తునాని ప్రమాణం చేసింది. అలా ఆమె మదీనాకు చేరుకున్నప్పుడు, ప్రజలు ఆమెను చూసి, ఇది అజ్బా, అంటే ప్రవక్త (స) గారి ఒంటె అని చెప్పుకోవడం ప్రారంభించారు. దేవుడు తనకు తప్పించుకోవడానికి సహాయం చేస్తే, ఆయన మార్గంలో ఒంటెను బలి ఇస్తానని ఆమె దేవునికి వాగ్దానం చేసిందని ఆమె పట్టుబట్టింది. కొంత చర్చ తర్వాత, ప్రజలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వద్దకు వెళ్లి ఈ విషయాన్ని హుజూర్ (స) వివరించారు, దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా సమాధానమిచ్చారు, "అల్లాహ్ పవిత్రుడు." ఈ ఒంటెకు ఆమె ఎంత దురదృష్టకర ప్రతిఫలం విధించింది. ఒకవేళ అల్లాహ్ ఈ ఒంటె ద్వారా ఆమెను కాపాడినచో అందుకు ప్రతిఫలముగా ఒంటెను బలి ఇస్తాను అని

వాగ్దానం చేయడం చాలా దురదృష్టకరం. ఇది మంచిది కాదు. మరల ఇలా తెలిపారు.

దేవుని అవిధేయతకు దారితీసే ఏ వాగ్దానాన్ని నెరవేర్చకూడదు. అదే విధముగా తనది కాని వస్తువుల విషయంలో ఇలా వాగ్దానం చేయడం కూడ సరికాదు.

మరల ఇలా తెలిపారు. నీవు ఈ ఒంటెకు యజమానిరాలువు కావు. ఇది నా ఒంటె. నీవు అల్లాహ్ పేరును స్మరిస్తూ క్షేమముగా ఇంటికి తిరిగి వెళ్ళిపొమ్ము!.

**(సహీ ముస్లిం, వాల్యూం. 8, పేజీలు. 236-237 కితాబ్ అన్-నజర్, బాబ్ లా వఫా'లీ నజారిన్ ఫి మా'సియాతిల్లాహి, హదీథ్ 3085) (సిరత్ ఇబ్న్ హిసామ్, ఘజ్వా జీ ఖరద్, దారుల్ కుతుబుల్ ఇల్మియా, పేజి 667)(సుబాలుల్ హుదా వర్రిషాద్, వాల్యూం 5, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజి.95)**

ఇప్పుడు, నేను మరొక యుద్ధంను గూర్చి ప్రస్తావిస్తాను. ఈ యుద్ధంను అబ్బాన్ బిన్ సయీద్ నజద్ యుద్ధం అని అంటారు. ఇది ముహర్రం హిజ్రి 7 వ సం॥లో జరిగింది. **(ముహమ్మద్ అజార్ ఫరీద్, ఘజ్వత్-ఓ-సరయ, ఫరీదియ్య పబ్లిషర్స్, సహివాల్, పేజీ. 390)** మరొక కథనం ప్రకారం, ఇది అదే సంవత్సరంలో జమాది ఉస్సాని నెలలో జరిగింది పేర్కొనబడింది. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి కూడా హిజ్రి 7 వ సం॥ ముహర్రంలో ఈ యుద్ధం జరిగినట్లు పేర్కొన్నారు. **(సుబాలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 128, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(సీరత్ ఖాతమున్నబియ్యాన్ (స) హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజి ఎం.ఏ పేజి 837)**

ఈ యుద్ధం హిజ్రి 7వ సం॥ ముహర్రం లో జరిగినట్లు అత్యంత ఖచ్చితమైన అంచనాగా అనిపిస్తుంది, ఎందుకంటే కథనాల ప్రకారం, ఖైబర్ వైపు బయలుదేరే ముందు, హజ్రత్ అబ్బాన్ బిన్ సయీద్ రజిను మదీనా నుండి నజ్ద్ వైపు పంపారు మరియు వారు హిజ్రి 7వ సం॥ ముహర్రం లో ఖైబర్ వైపు తమ ప్రయాణాన్ని ప్రారంభించారు.

**(సుబలుల్-హుదా వర్రిషాద్, వాల్యూమ్. 5, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీ. 115)**

హజ్రత్ అబ్బాన్ రజి గురించి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: హజ్రత్ అబ్బాన్ రజి గారి తండ్రి ఖురైష్ అధిపతులలో ఒకరు. అబ్బాన్ సోదరులు అమర్ మరియు ఖలీద్ అప్పటికే ముస్లింలుగా మారారు మరియు అబిస్సీనియాకు వలస వెళ్ళిన బృందంలో ఉన్నారు. అబ్బాన్ విగ్రహారాధకులతో కలిసి బదర్ యుద్ధంలో పోరాడాడు. హుదైబియా ఒప్పందం సమయంలో అతను హజ్రత్ ఉస్మాన్ రజికు అభయాన్ని కల్పించాడు. అమర్ మరియు ఖలీద్ అబిస్సీనియా నుండి తిరిగి వచ్చినప్పుడు, ఇద్దరు సోదరులు అబ్బాన్‌కు ప్రచారం చేశారు. ఆపై ముగ్గురు కలిసి ఖైబర్‌లో ఉన్నటు వంటి దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నారు. ఆ తరువాత అబ్బాన్ ఇస్లాంను స్వీకరించాడు. హజ్రత్ అబ్బాన్ బిన్ సయీద్ రజి హుదైబియా ఒప్పందం మరియు ఖైబర్ యుద్ధం మధ్య కాలంలో ఇస్లాంను స్వీకరించారు అని ఒక కథనంలో నమోదు చేయబడింది.దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మరణ సమయంలో, అబ్బాన్ రజి బహ్రెయిన్ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. తరువాత, అతను హజ్రత్ అబూ బకర్ రజిను చూడటానికి సిరియాకు బయలుదేరాడు.వారు హిజ్రి 13వ సం॥లోనే అమరులైనారు. మరొక కథనం ప్రకారం వారు హిజ్రి 27వ సం॥ అనగా హజ్రత్ ఉస్మాన్ రజి గారి ఖిలాఫత్ కాలంలో వీరమరణం పొందారు అని గలదు.

**(అల్-అసాబా ఫి తమిజిస్సహాబా, సంపుటి 1, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీలు 168-170) (ఉస్ద్ అల్-గబా, వాల్యూమ్. 1, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీలు 148)**

ఖైబర్ యుద్ధానికి బయలుదేరే ముందు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం నజ్ద్ వైపు దండయాత్రను పంపారు. నజ్ద్ పాక్షికంగా ఎడారి ప్రాంతం కానీ పచ్చదనంతో నిండి ఉంది, అనేక లోయలు మరియు పర్వతాలు విస్తరించి ఉన్నాయి. ఇది దక్షిణాన యెమెన్ నుండి ఉత్తరం వైపు సిరియా మరియు ఇరాక్ ఎడారి ప్రాంతాల వరకు విస్తరించి ఉంది. దాని పశ్చిమాన హిజాజ్ అని పిలువబడే ఎడారి ప్రాంతం ఉంది. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 1,200 మీటర్ల ఎత్తులో ఉంది, అందుకే దీనిని నజ్ద్ అని పిలుస్తారు. ఈ సైన్యం యొక్క ఉద్దేశ్యం - దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో లేనప్పుడు - మదీనాపై దాడి చేయడానికి ఎల్లప్పుడూ అవకాశం కోసం ఎదురు చూస్తున్న శత్రు తెగల నుండి మదీనాను సురక్షితంగా ఉంచడం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన సహచరులతో కలిసి మదీనాను విడిచి బయటి వెళ్ళిన సమయంలోనే మదీనాపై దాడి చేయడం చాలా మంచి సమయం అని శత్రు తెగలు భావించేవి. ఆ హజ్రత్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఇప్పుడు మదీనాలో లేరు మరియు సహచరులు కూడా వారితో పాటు వెళ్లిపోయి ఉంటారు. మదీనాలో చాలా తక్కువ మంది ఉంటారు. కావున మనం మదీనాపై దాడి చేసి మదీనాను జయించ వచ్చునని శత్రువులు భావించేవారు. ఈ ముప్పు పొంచి ఉండటం వల్ల, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని యుద్ధానికి బయలుదేరినా ప్రతిసారి ఇలాంటి తెగల వైపుకు కూడా కొంత సైన్యాన్ని పంపేవారు.

**(దాయిరే మాఆరిఫ్ సిరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్, వాల్యూమ్. 8, బాజ్మ్-ఇ-ఇక్బాల్, లాహోర్, పేజీ. 412) (ఫర్హాంగ్-ఎ-సిరత్, జవార్ అకాడమీ, కరాచీ, పేజీ. 297)**

ఈ యాత్ర గురించి సహీ బుఖారీలో ఈ క్రింది విధంగా ప్రస్తావించబడింది: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అబ్బాన్ రజిను మదీనా నుండి ఒక బృందానికి నాయకుడిగా నియమిస్తూ నజ్ద్ వైపు పంపారు. హజ్రత్ అబ్బాన్ రజి మరియు అతని సహచరులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఖైబర్‌ను జయించిన తర్వాత హుజూర్ (స) వద్దకు వచ్చారని హజ్రత్ అబూ హురైర రజి పేర్కొన్నారు. మరల హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా పేర్కొన్నారు. ఖైబర్ విజయం తర్వాత అబ్బాన్ మరియు అతని బృందం వచ్చినందున, యుద్ధ సంపదలో నుండి వారికి ఏమి ఇవ్వవద్దని నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కోరాను. అందువలన ఈ విషయంపై ఇద్దరూ విభేదించారు. అప్పుడు అల్లాహ్ ప్రవక్త!, "ఓ అబ్బాన్, కూర్చో" అని అన్నారు మరియు అబ్బాన్ ఖైబర్ వద్ద అధికారికంగా యుద్ధంలో పాల్గొనలేదు కాబట్టి హుజూర్ (స) అబ్బాన్ కు యుద్ధ సంపదలో నుండి ఏమి ఇవ్వలేదు. ఇది చాలా ఆమోదయోగ్యమైన కారణంగా అనిపిస్తుంది.

**(సహీహుల్-బుఖారీ, కితాబ్ అల్-మఘాజీ, బాబ్ ఘజ్వా ఖైబర్, హదీస్ 4328 మరియు 4329) (సుబలుల్-హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, దారుల్ కుతుబులల్ -ఇల్మియా, బీరుట్, పేజీ. 128)**

చరిత్ర పుస్తకాలలో మరొక యుద్ధ ప్రస్తావన గలదు. ఇది చాలా ప్రసిద్ధి చెందింది, అది ఖైబర్ యుద్ధం. ఖైబర్ అనేది వివిధ నీటి బుగ్గలు మరియు నీటి వనరులను కలిగి ఉన్న పచ్చదనం యొక్క విస్తారమైన విస్తీర్ణం మరియు అరేబియా ద్వీపకల్పంలో ఖర్జూరానికి అతిపెద్ద వనరులలో ఒకటిగా పరిగణించబడుతుంది. కతిబా అని పిలువబడే దాని లోయలలో ఒకదానిలో 40,000 కంటే ఎక్కువ ఖర్జూర చెట్లు ఉన్నాయనే వాస్తవం ద్వారా దాని పచ్చదనాన్ని అర్థం చేసుకోవచ్చును. ఖైబర్ లోయ మదీనాకు ఉత్తరాన 96 మైళ్ల దూరంలో ఉంది. యూదులు ఇక్కడ చాలా కాలంగా స్థిరపడ్డారు. చారిత్రక కథనాల ప్రకారం, ఇశ్రాయేలీయులు మూసా ప్రవక్త కాలం నుండి ఇక్కడ స్థిరపడ్డారు. కొంతమంది ప్రకారం చరిత్రకారుల ప్రకారం, వారు నెబుచాడ్నెజ్జార్ కాలం నుండి ఇక్కడ స్థిరపడ్డారు. యూదులు ఖైబర్‌లో చాలా కాలం స్థిరపడ్డారని మరియు వారు నిర్మించబడిన పెద్ద పెద్ద కోటలలో నివసించేవారని సూచించే మరికొన్ని కథనాలు ఉన్నాయి. ఈ ప్రదేశానికి వారికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది మరియు నేటికీ అదే నిజం అని చెబుతారు. హీబ్రూలో, "ఖైబర్" అంటే కోట అని అర్థం. కొన్ని యూద తెగలు మదీనాలో స్థిరపడ్డాయి, కానీ ఖైబర్‌లోని యూద తెగలు మదీనాలో ఉన్నవారి కంటే ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నాయి మరియు ఖైబర్‌లోని తెగలు యుద్ధంలో వారి అసాధారణ ధైర్యం మరియు సంకల్పానికి ప్రసిద్ధి చెందాయి. ఇంకా, వారు ఇతర తెగల కంటే కూడా ఐక్యంగా ఉన్నారు. ఈ కారణంగా, అరేబియా ద్వీపకల్పంలోని ఈ ప్రాంతం బలమైన మరియు ఏకీకృత శక్తిగా పరిగణించబడింది.

**(సిరాత్ ఎన్సైక్లోపీడియా, వాల్యూమ్. 8, దారుస్సలాం, పేజీలు. 328-331) (అత్తబకాతుల్ -కుబ్రా, వాల్యూమ్. 2, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరుట్, పేజీ. 81) (ఫర్హాంగ్-ఎ-సిరాత్, జావర్ అకాడమీ, కరాచీ, పేజీ. 66)**

మదీనా యూదులు అయినా, ఖైబర్ యూదులు అయినా, వారి కుట్రలు మరియు ద్రోహపూరిత కుట్రలు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఇస్లాంకు వ్యతిరేకంగా చాలా ఎక్కువగా ఉన్నాయి. వారి తీవ్రమైన అసూయ మరియు శత్రుత్వం కారణంగా, వారు ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం మరియు ఇస్లాంను పూర్తిగా నాశనం చేయడానికి ఏ అవకాశాన్ని కూడ వదిలిపెట్టలేదు. దీనికి విరుద్ధంగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ మదీనా యూదుల పట్ల దయతో వ్యవహరిస్తుండేవారు. మరియు వారితో శాంతి ఒప్పందాలను స్థాపించేవారు. వారు తమ ఒప్పందాలను ఉల్లంఘించినప్పుడల్లా లేదా వారి షరతులను ఉల్లంఘించి

నప్పుడల్లా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని క్షమిస్తూ వస్తుండేవారు. వారు అనేక సందర్భాల్లో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చంపడానికి ప్రయత్నించే స్థాయికి కూడా వెళ్ళారు. వారు వారి ఒప్పందాలను ఉల్లంఘించినప్పటికీ, మదీనాపై దాడి చేయడానికి వచ్చే శత్రు దళాలు సహాయడసాగారు. పర్యవసానంగా, యూదులకు చాలా కఠినమైన శిక్ష విధించబడుతుండేది. అప్పుడు కూడ న్యాయం మరియు ధర్మ సూత్రాలకు పూర్తిగా అనుగుణంగా మాత్రమే శిక్షించడం జరిగింది. అయితే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కరుణ మరియు క్షమాపణ స్థాయి చాలా గొప్పగా ఉండేది. ప్రవక్త (స) వారి జీవితాలకు మరియు సంపదకు శాంతి మరియు భద్రతను చేకూర్చే అభయానిచ్చేవారు. వారిని మదీనా నుండి బహిష్కరించినప్పుడు వారు కోరుకున్న వస్తువులను తమతో తీసుకెళ్లడానికి కూడా అనుమతించేవారు. ఒకవేళ,నవూజుబిల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి పట్ల కఠినముగా, అన్యాయంగా ప్రవర్తించి ఉన్నచో, మదీనా యూదులు పదేపదే ద్రోహానికి పాల్పడినప్పుడు ప్రవక్త (స) వారిని ఎప్పటికీ క్షమించి ఉండేవారు కాదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంకు రక్తపాతం సృష్టించడమే ఉద్దేశమైనచో బను ఖైనుఖా మరియు బను నజీర్‌లను వారి ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ పూర్తి రక్షణతో మదీనాను విడిచిపెట్టడానికి ప్రవక్త (స) ఎప్పుడూ అనుమతించేవారు కాదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఉద్దేశము సంపదను సంపాదించడమే అయినచో అరేబియా మొత్తంలో అత్యంత ధనవంతులుగా పరిగణించబడే బను నజీర్‌లను మదీనా పౌరుల ముందు బహిరంగ ప్రదర్శనలో ఉంచి పెద్ద సంచులు మరియు బంగారం మరియు వెండితో నిండిన సంచులతో మదీనాను విడిచిపెట్టడానికి ఎప్పటికీ అనుమతించేవారు కాదు. మదీనా యూదుల పట్ల ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం చూపిన దయ, దాతృత్వం, క్షమాపణ మరియు కరుణ, యూదులు ఖైబర్‌లో స్థిరపడిన తర్వాత, వారు ఇస్లాం మరియు ఇస్లాం స్థాపకుడితో శాంతి మరియు సయోధ్యను కోరుకోవలసింది. కాని యూదులు మదీనా నుండి బహిష్కరించబడిన తర్వాత, పెద్ద సంఖ్యలో ఖైబర్‌లో స్థిరపడ్డారు. మరోవైపు అప్పటికే యుద్ధంలో నైపుణ్యం కలిగిన బలమైన సైన్యంగా ఉన్న ఖైబర్, ఇప్పుడు ముస్లింలపై ప్రమాదకరమైన కుట్రలు మరియు కుతంత్రాలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ క్రమంలోనే ప్రముఖ నాయకులతో కూడిన ఖైబర్ యూదులు ఒక పెద్ద ప్రతినిధి బృందంను తీసుకోని మక్కా విగ్రహారాధకులను కలవడానికి వెళ్ళింది. వారు ఇస్లాంను మరియు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను నాశనం చేయడానికి ఒక పథకాన్ని సిద్ధం చేశారు. మక్క ప్రజలు దానికి అంగీకరించిన తర్వాత, ఈ ప్రతినిధి బృందం పొరుగు తెగలను కూడా సందర్శించాలని నిర్ణయించుకుంది. ఒక తెగ అంగీకరించిన తర్వాత, వారు 15,000 మంది సైన్యాన్ని సేకరించారు, ఇది చారిత్రాత్మకంగా చాలా పెద్ద సైన్యం మరియు వారు మదీనాపై దాడి చేశారు. దీనిని ఇస్లామిక్ చరిత్రలో అహ్‌జాబ్ యుద్ధం లేదా ఖందకం యుద్ధం అని పిలుస్తారు. ఇది ఇంతకు ముందు ప్రస్తావించబడింది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రత్యేక సహాయం మరియు సహాయం లేకపోతే, ముస్లింలతో పాటు, మదీనా పేరు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయి ఉండేది అనుటలో ఎటువంటి సందేహం లేదు. ఖైబర్ యూద నాయకులే ఈ ప్రమాదకరమైన కుట్రకు సూత్రదారులనుటలో కూడ ఎటువంటి సందేహం లేదు. ఇప్పుడు వారు ముస్లింలను అంతం చేయడానికి అనేక మార్గాలను వెతకడంలో మునిగిపోయారు. మదీనాలో బాను ఖురైజా వారి ఒడంబడికను ఉల్లంఘించి నందుకు వారికి విధించిన కఠినమైన శిక్ష కూడా ఖైబర్ యూదులను తమ అలవాట్లను మార్చుకునేలా చేయలేదు. అందువల్ల, ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి ఈ ద్రోహులు మరియు కుట్రదారులపై ప్రత్యక్ష చర్య తీసుకోవడం ఇప్పుడు అత్యవసరంగా మారింది, తద్వారా ప్రతి వ్యక్తి తమ స్వంత విశ్వాసం మరియు మతాన్ని వారికి ఎటువంటి భయం లేదా ప్రమాదం లేకుండా ఆచరించగలుగుతారు, ఇది ఈ క్రింది సూక్తి **యకూనద్దీను లిల్లాహి** అనగా అల్లాహ్ కోసమే మతాన్ని స్వేచ్ఛగా అనుసరించుము" అనుగుణముగా ఉన్నది. ధర్మంలో ఎటువంటి బలవంతం ఉండకూడదు, ఎందుకంటే ఇది మనిషికి మరియు దేవునికి మధ్య ఉన్న వ్యవహారం.

ఇస్లాంకు వ్యతిరేకంగా మరియు ఇస్లాం వ్యవస్థాపకుడికి వ్యతిరేకంగా విషం చిమ్మడానికి ఎప్పుడూ సిగ్గుపడని ప్రముఖ విమర్శకుడు మోంట్‌గోమేరీ వాట్ తన పుస్తకంలో ఇలా వ్రాశాడు, దాని అనువాదం ఇలా ఉంది: "ఖైబర్‌పై దాడికి సరళమైన మరియు స్పష్టమైన కారణం ఏమిటంటే, వారు (అంటే, ఖైబర్ ప్రజలు) తమ వద్ద ఉన్నటు వంటి సంపదను ఖర్చుచేస్తూ పొరుగు తెగలను ముస్లింలతో యుద్ధం చేయడానికి ప్రేరేపించడం. "

**(ముహమ్మద్ ప్రవక్త మరియు స్టేట్స్ మెన్, మోంట్‌గోమెరీ వాట్ పేజీ 189)**

అందువల్ల, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ తాలా నుండి స్పష్టమైన సంకేతాలను పొందిన తరువాత ఖైబర్‌పై యుద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. ఖైబర్ యుద్ధం హిజ్రి 7వ సం॥ జుమాది అల్-ఉలాలో జరిగిందని అల్లామా ఇబ్న్ సాద్ రాశారు. **(తబకతుల్ -కుబ్రా, వాల్యూమ్. 2, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీ. 81)** ఇబ్న్ ఉక్బా మరియు అల్లామా ఇబ్న్ ఇషాక్ ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం జుల్-హిజ్జాలో హుదైబియా నుండి మదీనాకు తిరిగి వచ్చారు మరియు దాదాపు 20 రాత్రులు మదీనాలో ఉన్న తర్వాత, ప్రవక్త (స) ముహర్రం నెలలో ఖైబర్‌కు బయలుదేరారు అని పేర్కొన్నారు.

**(సుబులుల్ హుదా వర్రిషాద్, వాల్యూమ్. 5, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, బీరూట్, పేజీ. 115)**

సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స)లో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి మిగిలిన శీర్షికల నోట్‌లో ఖైబర్ యుద్ధం హిజ్రి 7వ సం॥ సఫర్ మాసంలో జరిగినట్లుగా ప్రస్తావించారు.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ రజి ఎం.ఏ పేజీ. 837)**

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజి ఇలా పేర్కొన్నారు, "హుదైబియా నుండి తిరిగి వచ్చిన దాదాపు ఐదు నెలల తర్వాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖైబర్ నుండి యూదులను బహిష్కరించాలని నిర్ణయించుకున్నారు, ఎందుకంటే అది మదీనా నుండి కొద్ది దూరంలో ఉంది మరియు ముస్లింలకు వ్యతిరేకంగా సులభంగా పథకాలు వేయవచ్చు. ఆ విధంగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఆగస్టు 628లో 1,600 మంది సహచరులతో ఖైబర్ వైపు బయలుదేరారు."
**(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వర్-ఉల్-ఉలుమ్, వాల్యూమ్. 20, పేజీ. 325)**

కొంతమంది చరిత్రకారులు ఈ యుద్ధం హుదైబియా ఒప్పందం తర్వాత ఐదు నెలల తర్వాత జరిగిందని పేర్కొన్నారు మరియు హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి కూడ దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్‌లో ఆ విషయాన్నే ప్రస్తావించారు. అయితే, ఎక్కువ మంది చరిత్రకారులు మరియు హదీసు పండితులు ఈ యుద్ధం ముహర్రం నెలలో హుదైబియా ఒప్పందం తర్వాత కొన్ని రోజుల తర్వాత జరిగిందని పేర్కొన్నారు. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి కూడా పై విధముగానే ప్రస్తావించారు. వల్లాహు ఆలము. అంటే, "అల్లాహ్‌కు బాగా తెలుసు".

ప్రాథమికంగా చూసినచో, హుదైబియా ఒప్పందం గొప్ప విజయంగా చెప్పుకోవచ్చును. పవిత్ర ఖురాన్ దీనిని ఒక గొప్ప విజయంగా ప్రకటించింది, దీనిని గూర్చి ఇలా పేర్కొంది: **ఇన్నా ఫతహ్‌నా లక ఫత్‌హన్ ముబీనా** (ఫతహ్:2) "నిశ్చయంగా, మేము మీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము" ఈ స్పష్టమైన విజయపు ద్వారం. దీనిలో నుండి ప్రయాణిస్తూనే ఖైబర్ మరియు మక్కా వంటి గొప్ప విజయాలు సాధ్యమైనాయి. వాస్తవానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హుదైబియా ఒప్పందం నుండి తిరుగు ప్రయాణంలో, వారు మక్కా మరియు మదీనా మధ్య ఉన్నప్పుడు, సూరహ్ అల్-ఫతహ్‌ను అవతరింపజేస్తూ ఈ వాగ్దానం చేశాడు. ఈ అధ్యాయంలో, ఖైబర్ విజయం యొక్క శుభవార్తలను ఈ క్రింది విధంగా ప్రస్తావించాడు.

**లఖద్ రజియల్లాహు అనిల్ ముమినీన ఇజ్ యుబాయిఊనక తహత ష్షజరతి ఫఅలిమ మా ఫి ఖులూబిహిం ఫ అన్‌జల స్సకీనత అలైహిం వ అసాబహుం ఫత్‌హన్ ఖరీబా. వ మఘానిమ కసీరతన్ య్య ఖుజూనహా వకాన ల్లాహు అజీజన్ హకీమా వఅదకుముల్లాహు మఘానిమ కసీరతన్ తఅఖుజూనహా ఫఅజ్జల లకుం హాజిహీ** (ఫతహ్:19-21) "నిశ్చయంగా, విశ్వాసులు నీతో చెట్టు క్రింద బైఅత్ చేస్తున్నప్పుడు అల్లాహ్ వారి పట్ల చాలా సంతోషించాడు. మరియు వారి హృదయాలలో ఉన్నటు వంటి విశ్వాసంను గూర్చి తెలుసుకున్నాడు. ఫలితముగా వారి హృదయాలలో ప్రశాంతతను నింపాడు. మరియు అతను వారికి త్వరలో లభించునట్టి విజయాన్ని బహుమతిగా ఇచ్చాడు.(అంటే, ఖైబర్ యుద్ధ విజయం మరియు వారి సేకరించిన అత్యధికమైన యుద్ధ సంపదను అనుగ్రహించాడు.) ఖైబర్ సంపద కూడ వారికి లభించింది. వాటిని వారు తమ ఆదీనంలోకి తీసుకుంటున్నారు. మరియు అల్లాహ్ సర్వశక్తిమంతుడు, వివేకవంతుడు. మరియు అల్లాహ్ ఇంకా అనేక యుద్ధ సంపదలను గూర్చి మీతో వాగ్దానం చేశాడు. మీరు అతి త్వరలో తమ ఆధీనంలోకి దానిని తీసుకుంటారు. ప్రస్తుత యుద్ధ సంపదను అతడు మీకు చేసిన వాగ్దానం మేరకు త్వరగా అనుగ్రహించాడు.

సైన్యపు సన్నాహాలు మరియు మదీనాలో ఒక ఉపప్రతినిధి నియామకం

గురించి వివరాలు ఈ క్రింది విధంగా ప్రస్తావించబడ్డాయి:

ఖైబర్ వైపు బయలుదేరాలని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటించినప్పుడు, హుదైబియా ఒప్పందంలో పాల్గొన్న వారు మాత్రమే తమతో పాటు వస్తారని ప్రకటించారు. ఒక కథనం ప్రకారం, యుద్ధ సంపద కోసం బయలుదేరే వారు తమతో పాటు వెళ్లకూడదని, జిహాద్ చేపట్టడానికి మక్కువ ఉన్నవారు మాత్రమే యుద్ధంలో పాల్గొనాలని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్నారు. **(సుబులుల్ హుదా వర్రిషాద్, వాల్యూమ్. 5, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుట్, పేజీ. 115) (అత్తబాకతుల్-కుబ్రా, వాల్యూమ్. 2, దారుల్ కుతుబుల్ – ఇల్మియా, బీరుట్, పేజీ. 81)**

ఇబ్న్ హిషామ్ ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో హజ్రత్ నుమైలా బిన్ అబ్దుల్లా లైసిరాను తన ఉపప్రతినిధిగా నియమించారని, ఇమామ్ బుఖారీ ప్రకారం, హజ్రత్ సిబా బిన్ ఉర్ఫత రజిను ఉపప్రతినిధిగా నియమించారు అని పేర్కొన్నారు. **(సుబులుల్-హుదా వర్రిషాద్, వాల్యూమ్. 5, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీ. 115) (ఇమామ్ బుఖారీ, అత్తారిఖ్ అల్-సాగిర్, మక్తబా అల్-మారిఫ్, 1986, పేజీ. 43)**

పెద్ద జెండా వాడకంను మొదట ఖైబర్ యుద్ధంలోనే ప్రవేశపెట్టబడిందని అల్లామా ఇబ్న్ ఇషాక్ మరియు ఇబ్న్ సాద్ ఇద్దరూ పేర్కొన్నారు. దీనికి ముందు, చిన్న జెండాలు మాత్రమే ఉపయోగించబడ్డాయి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం హజ్రత్ అబూ బకర్ రజి, హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ హుబాబ్ బిన్ ముంజిర్ రజి మరియు హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ రజిలకు జెండాలను ఇచ్చారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం జెండా నలుపు రంగులో ఉంది, హజ్రత్ ఆయిషా రజి గారి శాలువాతో తయారు చేయబడింది. దీనికి "ఉకాబ్" అని పేరు పెట్టారు మరియు ఈ పతాకము హజ్రత్ హుబాబ్ బిన్ ముంజిర్ రజి వద్ద ఉంది. **(సీరతుల్-హలబియా, వాల్యూం. 3, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజి. 52) (షరఅ-జుర్కానీ, వాల్యూం. 3, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్, పేజి. 255)**

హజ్రత్ అలీ రజికు కూడా ఒక జెండా ఇవ్వబడింది, కానీ ఆ జెండాను ఖైబర్‌లో వారికి ఇచ్చారు ఎందుకంటే హజ్రత్ అలీ రజి ప్రారంభంలో తీవ్రమైన కంటినొప్పి కారణంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తో పాటు ప్రయాణించ లేకపోయారు, అందు వలన వారు రజి స్పష్టంగా చూడలేకపోయారు. అయితే, తరువాత, వారు రజి ఆందోళనకు గురై ప్రయాణించి, చివరికి ఖైబర్ చేరుకున్నారు. వారు తట్టుకోలేక పోయారు. ఈ ప్రయాణంలో విశ్వాసుల తల్లి అయినా హజ్రత్ ఉమ్మే సలామా రజి కూడ హుజూర్ (స)కు తోడుగా ఉన్నారు. **(సుబులుల్-హుదా వర్రిషాద్ వాల్యూమ్. 5, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, బీరుట్, పేజీ. 115) (దాయిరే మాఆరిఫ్ సిరతున్నబి, వాల్యూమ్. 8, బాజ్మ్-ఇ-ఇక్బాల్, లాహోర్, పేజీ. 391) (సిరత్ ఎన్సైక్లోపీడియా, వాల్యూమ్. 8, దార్ అల్-సలాం, పేజీ. 365)**

మరొక కథనం ప్రకారం, ఆరు లేదా ఏడుగురు మహిళా సహచరులు కూడా ఈ యుద్ధంలో పాల్గొన్నారు. మరొక కథనం ప్రకారం ఇరవై మంది మహిళా సహచరులు ఈ యుద్ధంలో పాల్గొన్నారు అని పేర్కొనబడింది.

హజ్రత్ ఉమ్మే సినాన్ అస్లామియా రజి ఇలా తెలిపారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఖైబర్ వైపు వెళ్లాలని అనుకున్నప్పుడు, ఆమె హుజూర్ (స) వద్దకు వెళ్లి, "ఓ అల్లాహ్ ప్రవక్తా!, మీరు అనుమతిస్తే, నేను మీతో పాటు రావాలనుకుంటున్నాను. నేను నీటి తొడుగులను శుభ్రపరుస్తాను, సైన్యం యొక్క సామాగ్రిని కాపాడతాను మరియు అనారోగ్యంతో మరియు గాయపడిన వారికి చికిత్స చేస్తాను" అని అడిగారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం తనకు అనుమతి ఇచ్చారని ఆమె చెప్పింది. అదేవిధంగా, బాను గఫర్ తెగకు చెందిన కొంతమంది మహిళలు కూడా ప్రవక్త (స) వద్దకు వచ్చి, "ఓ అల్లాహ్ ప్రవక్తా, మేము కూడా యుద్ధంలో పాల్గొనాలనుకుంటున్నాము. గాయపడిన వారిని మేము చూసుకుంటాము మరియు సైనికులకు వీలైనంత సహాయం చేస్తాము" అని అన్నారు. ప్రవక్త (స) వారికి అనుమతి ఇచ్చి, వారి కొరకు శుభప్రదములైన దుఆలు చేశారు. **(దైరా మఆరిఫ్ సిరత్ ముహమ్మద్ రసూలుల్లాస, వాల్యూమ్ 8, బాజ్మ్-ఇ-ఇక్బాల్, లాహోర్, పేజీ 371బీ సునన్ అబూ దావుద్, కితాబ్ అల్-జిహాద్, బాబ్ ఫి అల్-మరాతి వా అల్-అబ్ద్ యహ్జియాన్ మిన్ అల్-ఘనిమా, హదీసులు 2729బీ ఇమ్తా అల్-అస్మా, వాల్యూమ్ 1, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీ 321)**

మదీనా యూదులు ప్రవక్త (స) మరియు ఆయన సహచరుల సన్నాహాల గురించి తెలుసుకున్నప్పుడు, వారు చాలా కలత చెందారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఖైబర్‌లోకి ప్రవేశిస్తే, ఖైబర్‌కు కూడా బను ఖైనుఖా, బను నజీర్ మరియు బను ఖురైజాలకు జరిగినట్లే జరుగుతుందని వారు గ్రహించారు, వారు అప్పటికే ఓడిపోయారు. **(సుబుల్ అల్-హుదా వ అల్-రషద్, వాల్యూమ్. 5, దార్ అల్-కుతబ్-ఇల్మియా, బీరుట్, పేజీ. 115)**

మదీనా యూదులు ధనవంతులు, మరియు మదీనా ముస్లింలు వారి ఆర్థిక బలహీనత కారణంగా తరచుగా వారి నుండి అప్పులు తీసుకునేవారు. ఈ సమయంలో, ఖైబర్ యూదుల ప్రయోజనాల దృష్ట్యా, మదీనా యూదులు ముస్లింలకు ఇబ్బందులు కలిగించడానికి మరియు వారు యుద్ధానికి వెళ్లకుండా నిరోధించడానికి వెంటనే అప్పులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేయడం ప్రారంభించారు. **(బాష్మిల్, ఫత్-ఎ-ఖైబర్, నఫీస్ అకాడమీ, కరాచీ, పేజీ. 67)**

ఒక సహచరుడికి సంబంధించి ఒక సంఘటన ఉంది. హజ్రత్ ఇబ్న్ అబూ హద్‌రద్ ఇలా తెలిపారు. తాను అబూ షామ్ అనే యూదు రుణదాతకు ఐదు దిర్హమ్‌లు చెల్లించాల్సి ఉందని, మరొక కథనం ప్రకారం నాలుగు దిర్హమ్‌లు బాకీ ఉన్నాను అని తెలిపారు. అయితే ఆ యూదుడు ఇబ్నే అబూ హద్‌రద్‌ను తన డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశాడని హజ్రత్ ఇబ్న్ అబూ హద్రద్ వివరించారు. హజ్రత్ ఇబ్న్ అబూ హద్రద్ ఇలా సమాధానమిచ్చారు, "నాకు కొంత సమయం ఇవ్వండి. నేను ఖైబర్ నుండి తిరిగి వచ్చిన తర్వాత నేను మీకు తిరిగి చెల్లిస్తాను, ఎందుకంటే అల్లాహ్ తన ప్రవక్తతో ఖైబర్‌ను వారికి సంపదగా ఇస్తానని వాగ్దానం చేశాడు." అసూయ మరియు శత్రుత్వంతో నిండిన అబూ షామ్, "ఖైబర్ ప్రజలతో పోరాడటం సాధారణ తెగలతో పోరాడటం లాంటిదని మీరు అనుకుంటున్నారా? నేను తౌరాత్ ప్రమాణం చేస్తున్నాను, అక్కడ 10,000 మంది యోధులు ఉన్నారు." అన్నాడు. వారిద్దరూ తమ వాదనను దైవ ప్రవక్త (స) ముందుంచారు. ఆ సమయంలో, పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉంది మరియు ఈ యూదుడు ముస్లిం సైనికులను ఎగతాళి చేస్తూ ఖైబర్ యూదులకు అనుకూలంగా బలమైన పక్షపాతాన్ని వ్యక్తం చేశాడు. దేశాధినేతగా, దైవ ప్రవక్త (స) యూదునికి శిక్షను నిర్ణయించే అధికారం కలిగి ఉన్నాడు. అయితే, "ఈ యూదునికి అతని హక్కును ఇవ్వండి" అని ఆదేశించినప్పుడు దైవ ప్రవక్త (స) సహనం, ఓర్పు, న్యాయం మరియు ధర్మం యొక్క అద్భుతమైన ఉదాహరణ స్పష్టంగా కనిపించింది. హజ్రత్ ఇబ్న్ అబూ హద్రద్ ఇలా స్పందించారు, "నిన్ను సత్యంతో పంపిన అల్లాహ్ ప్రమాణం! నేను ఇప్పుడు అతనికి తిరిగి చెల్లించలేను." దైవ ప్రవక్త (స) మళ్ళీ ఇలా అన్నారు, "పరిస్థితులు ఎలా ఉన్నా, అతనికి అతని హక్కును ఇవ్వండి." హజ్రత్ ఇబ్న్ అబూ హద్రద్ తన తలపాగాను తీసివేసి నడుము వస్త్రంగా ఉపయోగించాడని వివరిస్తున్నారు. ఆ తర్వాత అతను తన నడుము కట్టులోని వస్త్రాన్ని మార్కెట్లో అమ్మి యూదుడి అప్పు తీర్చాడు. సల్మా బిన్ అస్లాం అతనికి మరొక వస్త్రం, అంగీని ఇచ్చాడు లేదా మరొక కథనం ప్రకారం, పరిస్థితి గురించి తెలుసుకునిఒక వృద్ధ మహిళా సహచరురాలు అతనికి బహుమతిగా ఇచ్చింది అని గలదు.

ఖైబర్‌లో జరిగిన యుద్ధంలో హజ్రత్ ఇబ్న్ అబూ హద్రద్‌కు అల్లాహ్ అనుగ్రహంతో యుద్ధ సంపద లభించింది. అందులో అదే అబూ షామ్‌కు బంధువు అయిన ఒక మహిళా ఖైదీ కూడా ఉన్నది. ఆ తర్వాత అతను ఈ స్త్రీని అతనికి అమ్మేశాడు. **(దాయిరే మఆరిఫ్ సిరత్ ముహమ్మద్ రసూలుల్లాస, వాల్యూమ్. 8, బాజ్మ్-ఇ-ఇక్బాల్, లాహోర్, పేజీలు. 373-374) (బష్మిల్, ఫత్-ఎ-ఖైబర్, నఫీస్ అకాడమీ, కరాచీ, పేజీ. 68)**

ముస్లిం సైన్యం ఖైబర్ వైపు ముందుకు సాగుతున్న వార్త విన్న మదీనా యూదులు ముస్లింలపై తమ ద్వేషం, శత్రుత్వం మరియు పక్షపాతాన్ని వ్యక్తం చేయడమే కాకుండా, అష్జా తెగకు చెందిన ఒక అనాగరికుడిని నియమించుకుని, ముస్లింల సైనిక సన్నాహాల గురించి అవసరమైన సమాచారంతో పాటు, యూదులు దృఢంగా నిలబడి ముస్లింలతో పోరాడాలని కోరుతూ ఒక సందేశాన్ని వెంటనే ఖైబర్‌కు పంపారు. వాస్తవానికి, ముస్లింల ప్రత్యర్థులకు గూఢచారి అవసరం లేదు, ఎందుకంటే మదీనాలోని కపటవాదులు అప్పటికే అలాంటి పనులను త్వరగా మరియు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అందువల్ల, ఈ సందర్భంలో కూడా, కపటవాదుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబయ్ బిన్ సలుల్ మౌనంగా ఉండలేదు. తన సహచరులలో ఒకరి ద్వారా, అతను ఖైబర్ యూదులకు అత్యవసర లేఖ పంపాడు. ఆ లేఖలోని విషయాలు ఇలా ఉన్నాయి:

"ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మీ వైపు వస్తున్నాడు. మీ రక్షణ కోసం చర్యలు తీసుకోండి, మీ కోటలలో మీ సంపదను దాచుకోండి మరియు యుద్ధభూమిలో అతన్ని ఎదుర్కోవడానికి సిద్ధం అవ్వండి. వారికి అస్సలు

భయపడకండి. మీరు సంఖ్యలో ఎక్కువగా ఉన్నారు, మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సైనికులు సంఖ్యలో తక్కువ, మరియు వారి వద్ద తక్కువ సంఖ్యలో ఆయుధాలు మాత్రమే ఉన్నాయి." **(బాష్మిల్, ఫత్-ఎ-ఖైబర్, పేజీలు 69 మరియు 72 అల్-సిరా అల్-హలాబియాలో ప్రస్తావించబడింది)**

ఖైబర్ యూదులు ముస్లిం సైన్యం రాక గురించి తెలుసుకున్నప్పుడు, వారి నాయకులు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు మరియు యూదు నాయకులలో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమైనట్లు ప్రస్తావించబడింది. ఖైబర్ యూదులు ముస్లిం సైన్యం రాక గురించి తెలుసుకున్నప్పుడు వారిపై ఎలా పోరాడాలో చర్చించడానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారని ప్రస్తావించబడింది. యూదు నాయకులు వివిధ సూచనలను ముందుకు తెచ్చారు. ఒక వర్గం యూదులు తమ కోటల లోపల తమను తాము అడ్డుపెట్టుకుని గోడల వెనుక నుండి పోరాడాలని సూచించారు, చివరికి ముస్లింలు నిరాశ కారణంగా ముట్టడిని విరమించుకోవలసి వస్తుందని నమ్మారు. అయితే, ప్రసిద్ధ ఖైబర్ యోధుడు మర్హబ్ సోదరుడు అబూ జైనాబ్ ఒక ప్రత్యామ్నాయ వ్యూహాన్ని ప్రతిపాదించాడు: కోటల లోపల నుండి పోరాడటానికి బదులుగా, వారు ముస్లింలను నేరుగా బహిరంగ మైదానంలో ఎదుర్కోవాలి. మదీనా యూదులు గతంలో తమ కోటల లోపల బారికేడ్లు వేయడం ద్వారా తమను తాము రక్షించుకోవడానికి ప్రయత్నించారని, కానీ చివరికి, ముస్లింలే విజయం సాధించారని ఆయన ఎత్తి చూపారు. అయినప్పటికీ, మొదటి వర్గం అబూ జైనాబ్ సూచనను తిరస్కరించింది, వారి కోటలు మదీనా యూదుల కంటే చాలా బలంగా ఉన్నాయని వాదించారు. ఖైబర్ దళాల సైనిక కమాండర్ సల్లం బిన్ మిష్కాం నుండి మూడవ ప్రతిపాదన వచ్చింది, ఇది మరింత అహంకారం మరియు ధైర్యంతో కూడుకున్నది. వారు మదీనాపై దాడి చేయాలని మరియు వారి మిత్రులందరితో కలిసి ముస్లింలను నిర్మూలించాలని ఆయన సూచించారు. ఈ అభిప్రాయంతో మెజారిటీ ప్రజలు ఏకీభవించారు, కానీ ఖైబర్ అధిపతి కినానా బిన్ అబూ అల్-హుకైక్ దీనిని వ్యతిరేకించారు. వారి కోటలు యాస్రబ్ కోటల మాదిరిగా లేవని, గర్వం మరియు అహంకారంతో, ముహమ్మద్ (స) వారిని సంప్రదించడానికి ఎప్పుడూ ధైర్యం చేయరని ఆయన పేర్కొన్నారు. అయితే, అందరు నాయకులు సైనిక సహాయం కోరడానికి చుట్టుపక్కల ఉన్న యోధుల తెగలకు ఒక ప్రతినిధి బృందాన్ని సిద్ధం చేసి పంపడానికి అంగీకరించారు. తత్ఫలితంగా, పద్నాలుగు మంది సభ్యుల ప్రతినిధి బృందం ఏర్పడింది, దీనికి కొన్ని సంప్రదాయాల ప్రకారం ఖైబర్ అధిపతి కినానా నాయకత్వం వహించారు. ఈ ప్రతినిధి బృందం బాను అసద్, ఘత్ఫాన్ మరియు ఇతరుల తెగలను సంప్రదించి, సైనిక మద్దతుకు బదులుగా ఖైబర్ వార్షిక ఉత్పత్తిలో సగం అందించింది. బాను ముర్రా తెగ, దూరదృష్టితో, అలాంటి సహాయం అందించడానికి నిరాకరించింది. అయితే, బాను అసద్ మరియు బాను ఘత్ఫాన్ వంటి పోరాడుతున్న తెగలు వెంటనే వెయ్యి మంది సాయుధ సైనికుల సైన్యాన్ని పంపాయి మరియు నాలుగు వేల మంది సైనికుల అదనపు దళాన్ని పంపడానికి సన్నాహాలు ప్రారంభించాయి. **(బాష్మిల్, ఫతే-ఎ-ఖైబర్, నఫీస్ అకాడమీ, కరాచీ, పేజీలు 75-77)**

ఏదేమైనా, భవిష్యత్తులో దీని గురించి మరిన్ని వివరాలను అందిస్తాను, ఇన్షా-అల్లాహ్. ఇప్పుడు , నేను కొంతమంది మృతుల విశిష్టతలను ప్రస్తావించాలను కుంటున్నాను.

మొదటి ప్రస్తావన గౌరవనీయులైన ముహమ్మద్ అష్రఫ్ సాహిబ్ గారిది. ఆయన ఇటీవలే దైవిక ఆజ్ఞ ప్రకారం మరణించారు. **ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.** ఆయనకు ముగ్గురు కుమార్తెలు మరియు ఆరుగురు కుమారులు ఉ న్నారు. ఆయన కుమారులలో ఒకరైన కాశిఫ్ జావేద్ సాహిబ్ ప్రస్తుతం సెనెగల్‌లో మిషనరీ-ఇన్‌చార్జ్‌గా మరియు జమాత్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు మరియు ఈ కారణంగా, తన తండ్రి అంత్యక్రియలకు హాజరు కావడానికి సెనెగల్ నుండి ప్రయాణించలేకపోయారు. మిషనరీ అయిన అతని కుమారుడు ఇలా వ్రాశాడు:

"నా తండ్రి చాలా నిరాడంబర హృదయుడు, మంచి స్వభావం గలవాడు, దైవభక్తి గలవాడు. అతనికి అహ్మదీయత్ మరియు ఖిలాఫత్ పట్ల అపారమైన ప్రేమ ఉండేది. అతను తన కుటుంబంలో ఏకైక అహ్మదీ మరియు తాము అహ్మదీయత్ వల్లనే అన్నింటిని సాధించుకున్నాము అని తరచుగా చెప్పేవారు. అతను తన పిల్లలకు అహ్మదీయత్ మరియు ఖిలాఫత్‌తో ఎల్లప్పుడూ సంబంధాన్ని కొనసాగించమని సలహా ఇచ్చేవాడు. అతని తాత ముహమ్మద్ అజామ్ సాహిబ్ 1968లో సర్గోధా సమీపంలోని భాబ్రా అనే గ్రామంలో అహ్మదీయత్‌ను అంగీకరించాడు మరియు ఆ సమయంలో, నా తండ్రి కూడా అహ్మదీ అయ్యాడు." తన తల్లి వైపు నుండి అహ్మదీ అయిన ఏకైక సోదరుడు తన తండ్రి అని అతను ఇంకా చెప్పాడు. మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన తర్వాత, అతను గ్రామాన్ని విడిచిపెట్టి మండి బహావుద్దీన్‌లోని షా తాజ్ షుగర్ మిల్లులో ఉద్యోగం పొందాడు, అక్కడే అతను మరణించే వరకు ఉన్నాడు. తన వృద్ధాప్యంలో, అతను పవిత్ర ఖురాన్ చదవడం ఆసక్తిగా నేర్చుకున్నాడు మరియు తరువాత దానిని అంకితభావం మరియు ప్రేమతో అధ్యయనం చేశాడు, అతను ప్రతి నెల ఒకటి లేదా రెండు పూర్తి పఠనాలను పూర్తి చేసేవాడు. రంజాన్ సమయంలో, అతను దానిని రెండు లేదా మూడు సార్లు పూర్తి చేసేవాడు. ఆయన ముఖ్యంగా పేదలకు సహాయం చేసేవారు మరియు ఎవరినీ ఎప్పుడూ ఖాళీ చేతులతో తిప్పి పంపేవారు కాదు. అల్లాహ్ వారికి ఇస్తున్న ఆశీర్వాదాలు అన్నీ జమాత్ కోసం తన జీవితాన్ని అంకితం చేసినందుకు లభించాయని తన తండ్రి తనకు చెప్పేవారని మిషనరీ చెప్పారు.

ఒక కుమారుడు, ముబాషర్ జావేద్ సాహిబ్ ఇలా తెలిపాడు. మృతుడు చాలా సంవత్సరాలుగా ఆర్థిక కార్యదర్శిగా ఉన్నారని, తన తండ్రి ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా తన చందాలను చెల్లించేవాడని చెప్పారు. అతను తన పెన్షన్ పొందినప్పుడల్లా, అతను మొత్తం సంవత్సరం చందాలు ఒకేసారి చెల్లించడానికి ప్రయత్నించేవాడు. అతను మరణించినప్పుడు కూడా, తన చందాలు చెల్లించబడ్డాయా లేదా అని అతను ఆందోళన చెందాడు మరియు అతను మరణించినప్పుడు అల్లాహ్ తన చందాలను చెల్లించడానికి తనకు అవకాశం ఇచ్చినందుకు చాలా కృతజ్ఞుడయ్యాడు.

అల్లాహ్ మృతుడికి క్షమాపణ మరియు దయను ప్రసాదించుగాకా! మరియు అతను వదిలిపెట్టిన వారికి అందరికీ సహనం మరియు ఓదార్పును ప్రసాదించుగాకా!.

రెండవ ప్రస్తావన కెన్యాకు చెందిన నాయబ్ అమీర్ హబీబ్ ముహమ్మద్ శాస్త్రీ సాహిబ్ గారిది. ముహమ్మద్ హబీబ్ శాస్త్రి సాహిబ్ కుమారుడు. ఆయన అరబ్ సంతతికి చెందినవారు, ఇటీవల 56 సంవత్సరాల వయసులో మరణించారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతుడు వసియ్యత్ చేశాడు. అతని గుర్తుగా తల్లిదండ్రులు, భార్య మరియు ముగ్గురు పిల్లలు జీవించి ఉన్నారు.

కెన్యా జమాత్ జాతీయ అధ్యక్షుడు మహమూద్ తాహిర్ సాహిబ్, తన పూర్వీకులు యెమెన్ నుండి వచ్చారని, అతని తండ్రి హబీబ్ శాస్త్రీ సాహిబ్ 1982 ఆగస్టులో అహ్మదీయత్‌ను అంగీకరించారని మరియు చాలా నిజాయితీపరుడైన అహ్మదీ అని చెప్పారు. మృతుడు అతని పెద్ద కుమారుడు. తన తండ్రి అంగీకరించిన కొద్దికాలానికే, ఆయన కూడా అహ్మదీయత్‌ను అంగీకరించి, మరణించే వరకు తన బైఅత్‌ను నెరవేర్చారు. మృతుడు మొంబాసాలో ప్రాథమిక విద్యను అభ్యసించారు మరియు చాలా సమర్థుడు మరియు ప్రతిభావంతుడైన విద్యార్థి. ఆ పాఠశాల ఆయనను తదుపరి విద్య కోసం కొంతకాలం ఫ్రాన్స్‌కు కూడా పంపింది. ఖులాఫాతో తన సమావేశాలను ఆయన ఎల్లప్పుడూ తన జీవితంలోని ఉత్తమ క్షణాలుగా అభివర్ణించారు – ఆయన హజ్రత్ ఖలీఫతుల్ మసీ హుర్రాబేహ్ రహ్మను కలిశారు మరియు నన్ను కూడా కలిశారు. ఆయనకు వివిధ హోదాల్లో సేవలందించే అవకాశం లభించింది. ఆయన మరణించే సమయానికి, ఆయన కెన్యా జాతీయ కార్యదర్శి తాలిమ్ మరియు నాయబ్ అమీర్ కెన్యా గా పనిచేస్తున్నారు.

ఆయన ఇంకా ఇలా అంటున్నాడు, "నాకు ఆయన ఇరవై సంవత్సరాలుగా తెలుసు. ఆయన జీవిత భక్తుల పట్ల ఎంతో గౌరవం చూపించారు మరియు తనకు అప్పగించిన ఏ పనిని అయినా అత్యంత గంభీరంగా నిర్వర్తించారు మరియు ఎటువంటి జ్ఞాపకం చేయవలసిన అవసరం లేదు. ఆయన నమాజ్‌లు క్రమం తప్పకుండా చదువేవారు, అల్లాహ్ ఆజ్ఞలు మరియు పరిమితులను జాగ్రత్తగా పాటించేవారు, చందాలు క్రమం తప్పకుండా చెల్లించేవారు. అద్భుతమైన నైతికత కలిగి ఉండేవారు, పేదల పట్ల శ్రద్ధ వహించేవారు, తన తల్లిదండ్రులకు విధేయత చూపే హక్కులను నెరవేర్చేవారు మరియు తన తమ్ముళ్లను చూసుకునేవారు. ఆయన తెలివైనవాడు, నిజాయితీపరుడు మరియు విశ్వాసపాత్రుడు. ఆయన ప్రధాన కంపెనీలలో ఉన్నత పదవులను నిర్వహించారు మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు ఆర్థిక శ్రేయస్సును అనుగ్రహించాడు. ప్రాపంచిక దృక్కోణం నుండి ఆయనకు వ్యాపారం,

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. ((ప్రతి శుక్రవారం సెలవు).**

రాజకీయ, ప్రభుత్వం మరియు మతపరమైన వ్యక్తులతో సంబంధాలు ఉన్నప్పటికీ, ఆయన అహ్మదీయత్‌పై తన నమ్మకాన్ని ఎప్పుడూ దాచలేదు, బదులుగా దానిని ప్రచారం చేయడానికి ఒక అవకాశంగా ఉపయోగించుకున్నారు. అందుకే ప్రభుత్వం, వ్యాపార రంగం, రాజకీయాలు మరియు మొంబాసా నుండి వచ్చిన ఉన్నత వర్గాల నుండి చాలా మంది ఉన్నత స్థాయి వ్యక్తులు ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు. అల్లాహ్ మృతుడికి క్షమాపణ మరియు దయను ప్రసాదించుగాకా! మరియు అతని ప్రియమైన వారందరికీ సహనం మరియు ఓర్పును ప్రసాదించుగాకా!

మూడవ ప్రస్తావన జింబాబ్వేలోని జమాత్‌కు స్థానిక అధ్యక్షుడిగా ఉన్న గౌరవనీయులైన అనుబి మాడింగో సాహిబ్ గారిది. ఆయన మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

జింబాబ్వే జమాత్ అధ్యక్షుడు అయిన ఆయన కుమారుడు యూసుఫ్ అనుబి సాహిబ్, ఇలా తెలిపారు. తాను మొదట్లో సున్నీ ముస్లిం అని, సమాజాన్ని వ్యతిరేకించే వాడినని, కానీ తన హృదయంలో ఇస్లాం పట్ల ప్రేమ ఉందని రాశారు. ఆయన మొదట మలావిలో ఉన్నారు, అక్కడ గణనీయమైన వ్యతిరేకత ఉంది. తరువాత ఆయన జింబాబ్వేకు వెళ్లారు, అక్కడ ఇస్లాం పట్ల తనకున్న ప్రేమతో, ఆయన తన చుట్టూ ప్రజలను సమీకరించి, తన ప్రాంతంలో సామూహిక ప్రార్థనలు ఏర్పాటు చేశారు. ఆయన హృదయంలో నిజమైన ముస్లిం కావాలనే కోరిక ఉంది. తరువాత, ఆయనకు జమాత్‌తో పరిచయం ఏర్పడింది. మన మిషనరీ సమియుల్లా సాహిబ్ ఆయనతో వివరణాత్మక చర్చలు జరిపారు మరియు చివరకు, ఆయన అహ్మదీయత్‌ను అంగీకరించారు మరియు ఆయన ప్రాంతంలో మొదటి అహ్మదీ. అహ్మదీయత్‌ను అంగీకరించిన తర్వాత, ఆయన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు, మరియు ఆయన కలిసిన ప్రజల నుండి కూడా ఎదుర్కొన్నారు. ఆయనను విడిచిపెట్టారు. వారు ఆయనకు ఇబ్బందులు సృష్టించారు, కాబట్టి ఆయన జమాత్ సమావేశాలు మరియు సామూహిక నమాజ్‌ల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని విడిచిపెట్టి, తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనమాజ్‌లు మరియు జుమా ప్రార్థనలు చేయడం ప్రారంభించాడు. అయినప్పటికీ, ఆయన దృఢ సంకల్పాన్ని కోల్పోలేదు మరియు బోధన కొనసాగించాడు మరియు చాలా మంది ఆయన సందేశాన్ని, జమాత్ సందేశాన్ని విని, ఆయన ద్వారా జమాత్‌లో చేరారు.

ఆయన ప్రభావవంతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి, ఆయనను చూసిన తర్వాత చాలా మంది జమాత్‌లో చేరారు. తన సొంత ఆర్థిక త్యాగం ద్వారా, జింబాబ్వేలోని అహ్మదీయ జమాత్ యొక్క మొదటి మసీదు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భూమిని కొనుగోలు చేశాడు. ఆయన జీవితకాలంలోనే అది పూర్తి కావాలని ఆయన కోరిక, కానీ అప్పుడు అది పూర్తి కాకపోయినా, ఇప్పుడు అది నిర్మాణంలో ఉంది. ఆయన చాలా నమ్మకమైన, నిజాయితీపరుడైన మరియు నమ్మదగిన వ్యక్తి. ఆయన ప్రజల సమస్యలను గొప్ప జ్ఞానంతో పరిష్కరిస్తారు. జమాత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యే ముందు కూడా, ప్రజలు తరచుగా ఆయనను విశ్వసించి, ఆయనపై ఆధారపడేవారు. ఆయన తన వ్యక్తిగత వనరుల నుండి పేదలకు సహాయం చేసేవారు. ఆయన ఇల్లు ఎల్లప్పుడూ అతిథులతో నిండి ఉండేది మరియు ఆయనకు జమాత్‌తో లోతైన భక్తి సంబంధం ఉంది. ఆయన ఎల్లప్పుడూ అందరినీ దేవునితో మరియు జమాత్‌తో కనెక్ట్ అవ్వమని ప్రోత్సహించేవారు. ఆయనకు ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు, నేను చెప్పినట్లుగా, ఆయన కుమారుడు జింబాబ్వే జమాత్ అధ్యక్షుడు, మరియు ఆయన మనవళ్లలో ఒకరైన ఖాసిం అనుబి, జామియాలో చదువుకున్న జింబాబ్వేలో మొదటి కేంద్ర మిషనరీ.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మృతుడికి క్షమాపణ మరియు దయను ప్రసాదించుగాకా! జమాత్ బోధనలు అతని తరాలలో కొనసాగుగాకా! వారు మంచి పనులు చేస్తూనే ఉండాలని కోరుకుంటున్నాను.

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్లె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఈ విధముగా తెల్పుచున్నాడు:

అనువాదము: నా గూర్చి నా దాసులు నిన్ను అడిగినప్పుడు (నీవిట్లనుము) "నేను మీ సమీపము నందే ఉన్నాను. నేను ఆరాధకుని ప్రార్థనను స్వీకరింతును. (ప్రార్థనలు చేయు) వారు సన్మార్గమును అవలంభించుటకు సావధానులై నా ఆదేశమును వినవలయును. నా యందు విశ్వాసము వుంచవలయును. (అల్ బఖరహ్: 187)

గౌరవనీయులైన సభాధ్యక్షులు, మరియు గౌ॥ సభికులారా!. నా ఉపన్యాస శీర్షిక "దుఆల ఆమోదము రూపములో దైవ ఉనికి నిదర్శనములు." ఆరంభములో నేను అల్ బఖరహ్ అధ్యాయములోని సూక్తిని చదివి దాని అనువాదమును వినిపించినాను. ఇందులో అల్లాహ్ తఆలా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంను సంబోధిస్తు ఇట్లనెను. ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నా దాసులు నా గురించి, నా ఉనికి గురించి అల్లాహ్ తఆలా ఉనికికి నిదర్శనమేది అని నిన్ను ప్రశ్నించినప్పుడు వారికి నీవు ఇట్లు సమాధానమివ్వుము. నేను వారికి సమీపములోనే ఉన్నాను. దాని గుర్తింపు ఏమనగా అతడు నన్ను పిలిచినప్పుడు అతని దుఆను (ప్రార్థనను) ఆమోదించి అతనికి సమాధానమిస్తాను. నేను వున్నానని తెలుపుటకు ఇదొక సాక్ష్యము. నా ఉనికి ఏదో భ్రమ కాదు. నేను వాస్తవానికి ఉన్నాను. నేనే ఈ సృష్టికి సృష్టికర్తను, యజమానిని. ఈ ప్రపంచమును మొత్తం నేనే నడుపుతున్నాను. ఒక రకంగా అల్లాహ్ తఆలా ఇందులో దేవుడు నామమాత్రముగానే చక్రవర్తి కాదు లేదా తాను నియమించిన చట్టములకు లోబడి వుండు దాసుడు కాదనే విషయమును వ్యక్తపరచెను. అతడు తన చట్టములో మార్పులు చేయవచ్చును. నిస్సందేహంగా అతడు తన పద్ధతి, వాగ్దానమునకు విరుద్ధంగా ఎలాంటి పని చేయడు. కాని అతడు సజీవమైన, సర్వశక్తిమంతుడైన దేవుడు. అతడు తన దాసుల దుఆలను వినగలడు, వాటికి ఖచ్చితమైన ఫలితములను వెలువడించగలడు.

అహ్మదియ్య జమాఅత్ వ్యవస్థాపకులు అలైహిస్సలాం ఎంతో చక్కగా ఇలా తెలిపారు.

నిన్ను ప్రపంచములో ఎవడు పిలిచినా
అతడు నిరాశకు గురి కాలేదు
అతనికి ఎంతో అసరాగా నీవే వున్నావు
అతనికి అత్యంత ప్రియమైన వాడవు నీవే
నేను నీ శుభములను ప్రకటించువాడనైతిని
నా శత్రువులను అవమానపరచిన వాడెంతో పవిత్రుడు

ఇస్లాం దుఆ విషయమును వివరణాత్మకము, విపులముతో ప్రత్యేకంగా మాత్రమే వివరించి సూచించడమే కాక ముస్లిములకు దుఆల ఆచరణాత్మక పాఠము ఇచ్చుటకు, దుఆల అలవాటు వేయుటకు మానవుని ప్రతి కదలికకు ఏదో ఒక దుఆను నిర్ణయించెను. తద్వారా అతని ఏ ఘడియ దైవ స్మరణ చేయకుండా వుండుటకు వీలు లేదు. మనకు ఒక సజీవ, సర్వశక్తిమంతుడైన దేవుడు వున్నాడు, అతడు మన దుఆలను వింటాడు, దానికి సానుకూల, మంచి ఫలితములను వెల్లడిస్తానే విషయము అతనికి ఈ అలవాటు ఎల్లప్పుడు గుర్తు చేయించును.

ఈ యుగాంతపు కాలపు ఇమామ్ సయ్యద్నా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"దుఆ ఒక వృథా, పనికిమాలిన విషయమని బుద్ధిహీనుడు భావిస్తాడు. ఒక్క దుఆతో మాత్రమే వైభవోపేతుడైన దేవుడు అన్వేషకుల కొరకు ప్రత్యక్షమగుతాడు, నేను సర్వశక్తిమంతుడనని వారి హృదయములపై సువార్తవాణి పంపునని అతనికి తెలియదు. ఈ జీవితములో ఆధ్యాత్మిక కాంతిని కాంక్షించే వారి కొరకు దుఆ ద్వారా మాత్రమే దైవ ఉనికి పట్ల నమ్మకము ప్రసాదించునని, సకల అనుమానములు, సందేహములను నివృత్తి చేయునని నమ్మకము పొందుటకు ఆకలితో, దాహముతో వున్న



వ్యక్తి గుర్తుంచు కోవలెను." (అయ్యాముస్సులహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 14, :పుట 239)

ఇంకా ఇట్లనిరి. "ఆపదలలోనే దుఆల చిత్ర విచిత్ర విశిష్టతలు, ప్రత్యేకతలు బహిర్గతమైతాయి. నిజమైన విషయమేమనగా మన దేవుడు దుఆలతోనే గుర్తింప బడుతాడు." (మల్ఫూజాత్ సంపుటి 2 పుట 147, ప్రచురణ ఖాదియాన్ 2003)

ఇంకా మరో చోట వారిట్లు తెలిపిరి. "పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఒక చోట తన గుర్తింపునకు ఒక లక్షణము ఇట్లు విధించెను. అనగా ఇబ్బందులలో చిక్కుకున్న వారి దుఆను విను దేవుడే మీ దేవుడు. అతడిట్లు తెలిపెను. అమ్మన్ యుజీబుల్ ముజ్‌తర్ర జా ద ఆఅ అనగా అల్లాహ్ తఆలా దుఆ ఆమోదమును తన ఉనికికి గుర్తింపుగా నిర్ణయించినప్పుడు దుఆల వలన అవసరములు తీరునని ఎలాంటి గట్టి ఫలితము వెలువడదని, కేవలం ఇదొక ఆచారము, ఇందులో ఎలాంటి ఆధ్యాత్మిక లేదని ఒక వివేకి, సిగ్గు గల వ్యక్తి ఎలా భావించగలడు? సత్యమైన విశ్వాసము గల వ్యక్తి ఇలా ఎన్నడు భావించలేడని నా భావన. భూమ్యాకాశముల సృష్టి గురించి గ్రహించిన వారు నిజమైన దేవుణ్ణి గుర్తించినట్లే దుఆ ఆమోదముతో సైతం అల్లాహ్ తఆలాపై నమ్మకము కలుగుననే విషయము వాస్తవమైనది."

(అయ్యాముస్సులహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 14, :పుట 259)

గౌరవనీయులైన ప్రేక్షకులారా! ప్రపంచ మతముల చరిత్ర, ఆచారముల ప్రకారము మనకు చాలా స్పష్టంగా ఒక విషయము కనిపించును. అదేమనగా దేవుని తరపున అవతరించు ప్రతి సందేశహరుడు దుఆ ఆమోదము ద్వారా దైవ ఉనికికి నిదర్శనము ఇచ్చెను. వివిధ సందేశహరులు, వారి వ్యతిరేకులను ప్రస్తావిస్తు దుఆ ఆమోదపు అనేక సంఘటనలను పవిత్ర ఖుర్ఆన్ వివరించెను. హజ్రత్ ఆదమ్ అలైహిస్సలాం దుఆ, దైవ సంబంధము వల్లనే వారి కాలపు దుష్టుడు, అహంకారి ఇబ్లీస్, అతని అనుయాయులు శిక్షకు గురై, దైవ సన్నిధి నుండి బహిష్కరించబడిరి. హజ్రత్ నూహ్ అలైహిస్సలాంను వారి జాతి నిరాకరించి చాలా బాధలకు గురి చేసి, వారిని అవమానపర్చెను. అప్పుడు వారిట్లు దుఆ చేసిరి. رَبِّ لَا تَذَرْ عَلَى الْاَرْضِ مِنَ الْكٰفِرِيْنَ دَيَّارًا (నూహ్:27) అనగా "ఓ నా ప్రభువు! భూమిపై అవిశ్వాసుల ఏ గృహము కూడ మిగుల కూడదు". ఓ అల్లాహ్! ఇటువంటి కృతఘ్నులు, దురదృష్టవంతులు, గర్వితులను ప్రపంచములో మిగలకుండా చేయుము. దీని ఫలితముగా ఎటువంటి వరద వచ్చినదనగా నగరములకు నగరములు కొట్టుకుపోయినవి. నూహ్ అలైహిస్సలాం నావ ఎక్కిన వారు మాత్రమే ప్రాణాలతో మిగిలిరి. హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం దుఆ ఫలితముగనే నమ్రూద్ అగ్ని పుష్పముల రూపములో మారిపోయెను. వారి దుఆ మహిమ వల్లనే వారి సంతానములో తరతరాలుగా అనన్య సందేశహరులను అల్లాహ్ తఆలా పంపించెను. వారిలో హజ్రత్ మూసా అలైహిస్సలాం, హజ్రత్ ఈసా అలైహిస్సలాం, చివరలో మన ప్రియమైన నాయకులు హజ్రత్ ముహమ్మద్ అరబి సల్లల్లాహు అలైహి వసల్లం ఖాతమున్నబియ్యీన్ కిరీటం తమ తలపై ధరించి ప్రపంచములో ప్రభవించిరి. హజ్రత్ మూసా అలైహిస్సలాం దుఆ ఫలితముగనే వారి చేతిలో వున్నటువంటి ఒక సాధారణ కర్ర మాంత్రికుల మంత్రదండములకు ధీటుగా కొండచిలువగా మారి, మాంత్రికులు విశ్వాసము ప్రకటించుటకు కారణమయ్యెను. ఫిర్ఔన్ వంటి క్రూరుడు, కఠినుడు తన సైన్యముతో సహా ఇస్రాయీల్ సంతతిని వెంబడించెను, అప్పుడు మూసా జాతీయులు భయపడి اِنَّا لَمُدْرَكُوْنَ అనగా మేము పట్టుబడితిమని మొత్తుకొనిరి. కాని అల్లాహ్ తఆలా హజ్రత్ మూసా అలైహిస్సలాం దుఆను ఆమోదించి వారికి ఇట్లు అభయమిచ్చెను. كَلَّا ۚ اِنَّ مَعِيَ رَبِّيْ سَيَهْدِيْنِ (అష్షుఅరా:63) అనగా (మూసా) సమాధానముగా "ఎన్నడు ఇట్లు జరుగదు నా ప్రభువు నా వెంట నున్నాడు. అతడు నాకు విజయ మార్గము చూపున"నెను. తర్వాత ఏమైనది? ఫిర్ఔన్, అతని సైన్యము మునిగిపోయెను. మూసా జాతీయులు సురక్షితంగా కన్ఆన్ (ఇజ్రీయీల్)కు చేరుకొనిరి. యూదులు హజ్రత్ ఈసా అలైహిస్సలాంను అసత్యుడని నిర్ణయించి, శాపపు మరణము చెంది అసత్యులుగా భావించబడవలెనని వారిని శిలువపై చంపదలచిరి. కాని హజ్రత్ మసీహ్ గతస్మనే అనే తోటలో రాత్రి రోధిస్తు ఇట్లు దుఆలు చేసిరి. ఓ అల్లాహ్! సాధ్యమైనచో నన్ను ఈ ఆపద నుండి రక్షించుము. శిలువపై వారిని ఎక్కించినప్పుడు ఈలీ ఈలీ లిమా సబఖ్తానీ అనగా ఓ అల్లాహ్! నువ్వు నన్ను ఎందుకు విడిచిపెట్టినావని దుఆ చేసిరి. ఇదే దుఆ ఫలితముగా హజ్రత్ ఈసా అలైహిస్సలాంను అల్లాహ్ తఆలా శిలువపై నుండి శాపపు మరణముతో రక్షించడమే కాక వారు శిలువపై నుండి సజీవంగా దించబడిరి. గాయములకు చికిత్స చేసిన అనంతరరం వారు జరూసలేం నుండి వలస చేసి కశ్మీర్ వరకు సుదీర్ఘ ప్రయాణము చేసి చేరుకొనిరి.

గౌ॥ శ్రోతలారా! భారత పవిత్ర గడ్డపై హజ్రత్ శ్రీ రాముని దుఆ ఫలితము వల్లనే వనవాసం, నిస్సహాయత, క్లిష్టతరమైన అరణ్య జీవితము గడుపుతున్నను వారు క్రూరుడు, శక్తివంతుడైన రావణాసురున్ని హతమార్చి, లంకను జయించగలిరి. శ్రీ కృష్ణ భగవాన్ దుఆ ఫలితముగనే వారిని ఎదురించిన పాపి, అత్యంత ప్రభావశీలుడైన కన్స్ వంటి రాజు హతమయ్యెను. శ్రీ కృష్ణ మహరాజ్ దుఆ, ఉపదేశము వల్లనే అధిక సంఖ్యాకులైన కౌరులపై పాండవులకు విజయము లభించడమే కాక ప్రపంచానికి గీతా లాంటి పవిత్ర గ్రంథ జ్ఞానము లభించినది. అందరిని మించి మన ప్రియతమ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వ్యక్తిత్వము పూర్తిగా దుఆలో లీనమయ్యెను. వారి సల్లం దుఆ ఫలితముగనే అల్లాహ్ తఆలా ప్రపంచములో ఒక గొప్ప విప్లవము సృష్టించెను. తీవ్ర వ్యతిరేకత, వారి సల్లంను, వారి అనుచరులను, ఇస్లాంను నామరూపాల్లేకుండా చేయాలని ఎన్ని ప్రయత్నములు చేయబడినను కొన్ని సంవత్సరములలోనే ఇస్లాం అరబ్ దేశములో వ్యాపించడమే కాక క్రమేణ మొత్తం ప్రపంచములో ఇస్లాం కీర్తి సంపాదించెను. ఈ మహా అద్భుత విప్లవము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ ఇట్లనిరి.

"అరేబియా ఎడారుల్లో ఒక విచిత్ర సంఘటన జరిగింది. వందల, వేల సంఖ్యలో మృతులు తిరిగి కొన్ని రోజులలోనే పునర్జీవితులైనారు. తరతరాల నుంచి అవినీతి పరులైన వారికి దివ్యమైన రూపం లభించింది. అంధులు తిరిగి చూడగలిగినారు. మూగవారి నాలుకల నుంచి దైవజ్ఞానం వెలువడింది. ప్రపంచంలో ఇలాంటి విప్లవాన్ని ఇంత వరకు ఏ కన్నూ చూడలేదు. ఏ చెవీ వినలేదు. ఈ విచిత్రం మీకు తెలుసునా? ఇదంతా కటిక చీకటిలో ఒకడు చేసిన ప్రార్థనల వల్ల జరిగింది. అతడు సంపూర్ణముగా దేవుని ధ్యానంలో నిమగ్నుడై ప్రపంచంలో ఒక మహా విప్లవాన్ని తెచ్చి, ఒక నిరక్షరాస్యుడు, నిస్సహాయుడు అయిన వ్యక్తికి ఈ అద్భుత చర్య అసాధ్యమైనను అతడు దీన్ని సాధించినాడు.


(అనగా ఓ అల్లాహ్! అతనికి శాంతిని, ఆశీస్సులు ప్రసాదించు. అతని అనుయాయులను అనుగ్రహించు. తన ముస్లిం ప్రజల కోసం కష్టాలను భరించిన ఆ ప్రవక్తపై నీ దయా జ్యోతిస్సులను సదా వర్షింపుము.) నేను నా స్వీయ అనుభవముతో చూస్తున్నదేమనగా దుఆల శక్తి నీటి, అగ్ని శక్తి కంటే గొప్పది. వాస్తవానికి స్వభావరీత్యా దుఆ వలె గొప్ప శక్తి కలిగిన మరే వస్తువు లేనే లేదు."

*(బరకాతుద్దుఆ – రూహాని ఖజాయిన్ సంపుటి:6 పుట:10,11)*

గౌ॥ శ్రోతలారా! అల్లాహ్ తఆలా తన ఉనికిని నిరూపించుకొనుటకు తమ ప్రవక్తలు, అవతార పురుషుల దుఆలను అధికంగా ఆమోదిస్తాడు. ఈ అంశము ఎంత విశాలమైనదనగా మొత్తం సంఘటనలను ప్రస్తావించుట సముద్రమును కుండలో నింపినట్లగును. అయినను కొన్ని విశ్వాస భరిత సంఘటనలను ఉదామహరణగా ప్రస్తావించదలచితిని.

మన యజమాని హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తుత్వ ప్రకటన చేసినప్పుడు వారిని సత్యవంతులు, నీతిమంతులు అని కీర్తించే

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

జాతియే వారిని తిరస్కరించడమే కాక వారిని, వారి అనుచరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసెను. వారిని హత్య చేయుటకు ప్రణాళికలు రచించబడెను. వారి అనేక అనుచరులను హత్య చేసిరి కూడ. ఇంతటి భయంకరమైన కాలములో వ్యతిరేకతలో మక్కాలోని ఇద్దరు శక్తిమంతులైన నాయకులు అందరికంటే ముందుండిరి. ఒకరు అమర్ బిన్ హష్షామ్ (అబూజహల్) మరొకరు ఉమర్ బిన్ ఖత్తాబ్. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ తఆలాతో ఇట్లు దుఆ చేసిరి. "ఓ అల్లాహ్! ఈ ఇద్దరు వ్యక్తులు అనగా అమర్ బిన్ హష్షామ్, ఉమర్ బిన్ ఖత్తాబ్‌లోని (నీకు ఇష్టమున్న) ఒక వ్యక్తి ద్వారా ఇస్లాంకు గౌరవము, బలము ప్రసాదించుము."

(తిర్మిజి కితాబుల్ మనాఖిబ్, బాబ్ 18)

అనంతరం అల్లాహ్ తఆలా వారి సల్లం దుఆను అత్యంత గొప్ప రీతిలో అద్భుతంగా ఆమోదించినట్లు ప్రపంచము చూసెను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను హతమార్చుటకు ఖడ్గము పట్టుకొని ఇంటి నుండి బయలు దేరిన అదే ఉమర్ పవిత్ర ఖుర్‌ఆన్ గొప్ప సన్మార్గ వైభవము, దుఆ ఖడ్గముతో గాయాలపాలై ఇస్లాం స్వీకరించిరి. తద్వారా ముస్లిములకు చాలా గొప్ప ధైర్యము లభించినది. అన్యారాధకులు ముస్లిముల జీవిత మనుగడను అత్యంత కష్టతరము చేసినప్పుడు వారు సల్లం, వారి అనుచరులు మక్కా నుండి మదీనాకు వలస పోవలసి వచ్చెను. ఈ వలస సంఘటన జరిగి కష్టంగా ఒక్క సంవత్సరం గడిచినదో లేదో హిజ్రి రెండవ సంవత్సరంలో మక్కా అన్యారాధకులు మదీనాపై దాడి చేసి ముస్లిములను అంతమొందించుటకు ప్రయత్నించిరి. అప్పుడు బదర్ ప్రాంతములో సంభవించిన యుద్ధములో నిస్సహాయ, నిరుపేద ముస్లిముల సంఖ్య కేవలం 313 వుండగా యుద్ధ అనుభవజ్ఞులైన వెయ్యి మంది ఆయుధములు ధరించిన సైనికుల రూపంలో అవిశ్వాసులుండిరి. ఈ సందర్భంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో దుఃఖముతో ఇట్లు దుఆ చేసిరి. "ఓ అల్లాహ్! నేడు ఒక వేళ నువ్వు ఈ కొద్దిపాటి ఏకదైవారాధకులను నాశనము చేసినచో తర్వాత నిన్ను ఎవరు ఆరాధింతురు!!

(బుఖారి కితాబుల్ మఘాజీ అధ్యాయము 4)

బదర్ ప్రాంతములో ఒక గుడిసెలో దుఃఖముతో చేసిన ఈ దుఆ అల్లాహ్ తఆలా ఆస్థానములో ఆమోదించబడినప్పుడు విసిరిన పిడికెడు ఇసుకను అల్లాహ్ తఆలా పెద్ద తుఫానుగా మార్చి అచేతనంగా వున్న 313 ముస్లిములకు ఆయుధములతో కూడిన వెయ్యి మంది గల క్రూర సైన్యముపై విజయము ప్రసాదించెను.

గౌ॥ సభికులారా! సజీవమైన దేవుని సజీవ సాక్ష్యమునకు మరొక సంఘటన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములో మరొకసారి ఇట్లు సంభవించెను. ఈరాన్ చక్రవర్తి ద్వితీయ ఖుస్రుపర్వేజ్ యూదులు రెచ్చగొట్టినందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను బంధించాలని తన యెమెన్ గవర్నర్ బాజాన్‌కు ఇట్లు ఆదేశము పంపెను. ప్రవక్తుత్వ ప్రకటనకర్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను బంధించి నా వద్దకు పంపుము. కనుక వారి సల్లంను బంధించి తీసుకొని రావాలని బాజాన్ ఇద్దరు సైనికులను మదీనాకు పంపెను. ఆయా దూతలు వచ్చి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ ఆదేశము వినిపించి, ఇట్లు హెచ్చరించిరి. మీరు సల్లం కిస్రా (ఖుస్రుపర్వేజ్) ఆదేశమును నిరాకరించినచో అతడు మిమ్ములను మీ దేశమును నాశనము చేయును. అప్పుడు వారు సల్లం మీరు రేపు ఉదయం వచ్చి నాతో కలవండని ఆ దూతలకు తెలిపిరి. అనంతరం రాత్రి వారు అల్లాహ్ తఆలాతో దుఆ చేసిరి. తద్వారా వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా వారికిట్లు సమాచారము అందించెను. కిస్రా చేసిన ఈ అవమానకర పనికి శిక్షగా మేము అతని కుమారుణ్ణి అతనిపై నియమించాము. కావున ఉదయం వారు సల్లం ఆయా దూతలను ఇట్లు వార్తనందించిరి. నేటి రాత్రి నా దేవుడు మీ దేవుణ్ణి హతమార్చినాడు. ఇలాగే జరిగెను. ఏ రాత్రి అల్లాహ్ తఆలా ఇలా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈరాన్ చక్రవర్తి ద్వితీయ ఖుస్రుపర్వేజ్ హత్యకు గురైనట్లు అల్లాహ్ సందేశమందించెనో అదే రాత్రి అతని కుమారుడు షేరూయ అంటూరు అతనిని హతమార్చి ప్రభుత్వమును కైవసం చేసుకొనెను. అనంతరం అతడు యెమెన్ గవర్నర్‌కు ఇట్లు ఆదేశమందించెను. ప్రవక్తుత్వ ప్రకటనకర్తను బంధించుటకు నా తండ్రి ఇచ్చిన ఆదేశమును నేను రద్దు చేస్తున్నాను. సుబహానల్లాహ్.

ఈ వార్తను విని యెమెన్ గవర్నర్ బాజాన్ మాత్రమే కాక ఆ ప్రాంతములో నివసిస్తున్న చాలా మంది ఈరానీ పౌరులు కూడ ఇస్లాం స్వీకరించిరి. ఫల్‌హందులిల్లాహ్ అలా జాలిక్.

గౌ॥ శ్రోతలారా! దుఆ ఆమోద సంఘటనలు గతించిన కథలు మాత్రమే కాదు అల్లాహ్ తఆలా ప్రతి కాలములో తన సజీవ ఉనికికి నిదర్శనములు ఇచ్చుటకు మన కాలములో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు నిజమైన అభిమాని, దాసుడు సయ్యద్నా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాంను పంపించెను. వారిట్లు తెలిపిరి.

"సజీవమైన, సర్వస్థితికి కారణుడైన మన దేవుడు మానవుని వలె మాట్లాడుతాడు. మనము ఒక విషయము అడిగి, దుఆ చేసినప్పుడు అతడు శక్తివంతమైన మాటలతో సమాధానము ఇస్తాడు. ఈ పరంపర వెయ్యి సార్లు కొనసాగినను అతడు జవాబు ఇవ్వడానికి వెనుకడుగు వేయడు. అతడు తన వాక్యములో చిత్ర విచిత్ర విషయములను వెల్లడిస్తాడు. మహిమాన్వితమైన శక్తుల దృశ్యములను ప్రదర్శిస్తాడు. తుదకు దేవుడు అనదగు ఉనికి తానే అని నమ్మకము కలిగిస్తాడు."

(నసీమె దావత్, రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 448)

దేవుని ఉనికి నిదర్శనములో వారు అలైహిస్సలాం తమ పుస్తకము హఖీఖతుల్ వహీలో 208 సంకేతములను పొందుపర్చినారు. వాటిలోని ఒక్క సంకేతమును మాత్రమే ప్రవేశపెట్టుతున్నాను. ఇది దేవుని సజీవ ఉనికికి గట్టి సాక్ష్యము. వారిట్లు తెలిపిరి.

"దక్షిణ హైద్రాబాద్ నివాసి అయిన అబ్దుల్ కరీమ్ నామము గల బాలుడు మా పాఠశాలలో విద్యార్థిగా వున్నాడు. దైవికముగా అతణ్ణి పిచ్చి కుక్క కరిసెను. చికిత్స కొరకు మేము అతణ్ణి కసోలీ పంపించాము. కొన్ని రోజుల వరకు కసోలీలో అతనికి చికిత్స చేయబడెను. తిరిగి అతడు ఖాదియాన్ వచ్చెను. కొన్ని రోజుల తర్వాత పిచ్చి కుక్క కరిసిన తర్వాత వెలువడే లక్షణములు అతనిలో బహిర్గతమయ్యెను. నీటితో భయపడడం మొదలుపెట్టెను, చాలా భయంకర స్థితి ఏర్పడెను. అప్పుడు తన మాతృభూమిని విడిచి వచ్చిన ఆ బాలుని పట్ల నాకు చాలా కలత కలిగెను. తద్వారా దుఆ కొరకు ఒక ప్రత్యేక శ్రద్ధ కలిగెను. కొన్ని గంటల తర్వాత ఆ నిస్సహాయుడు మరణించునని ప్రతి ఒక్కరు భావించసాగిరి. విధిలేక అతనిని బోర్డింగ్ నుండి బయటకు తీసి విడిగా వున్న ఒక గృహములో ఇతరుల నుండి అతనిని దూరముగా అన్ని జాగ్రత్తలతో పెట్టబడెను. ఇందుకు ఏమైనా చికిత్స వున్నదా అని కసోలీలో వున్న ఆంగ్ల వైద్యులను అడుగుతు ఉత్తరము కూడ పంపబడెను. అక్కడి నుండి టెలిగ్రామ్ ద్వారా ఇట్లు సమాధానము వచ్చెను. ఈ దశలో అతనికి ఎలాంటి చికిత్స లేదు. కాని ఈ నిరుపేద, మాతృభూమి నుండి దూరముగా వున్న బాలుని కొరకు నా హృదయములో చాలా శ్రద్ధ కలిగినది. నా మిత్రులు కూడ అతని కొరకు దుఆ చేయాలని చాలా పట్టుబట్టిరి. ఎందుకనగా తన స్వస్థలం నుండి దూరముగా వున్న ఈ బాలుని స్థితి చాలా దయనీయంగా వుండెను. అతను మరణించినచో చాలా పెద్ద ఎత్తున అతని మృతి శత్రువుల సంతోషమునకు అవకాశము కల్పించునని కూడ ఆలోచన కలిగెను. అప్పుడు నా మనసు అతని కొరకు చాలా బాధకు గురై వ్యాకులత చెందెను. స్వంత శక్తితో ఏర్పడని శ్రద్ధ మహిమాన్వితంగా కలిగెను. ఎందుకనగా అది కేవలం దేవుని శుభముతో కలుగును, అలా శ్రద్ధ కలిగినప్పుడగు అది దేవుని అనుమతితో ఫలితము కూడ చూపించును. తద్వారా మృతులు కూడ జీవించగలరు. సారాంశమేమనగా అతని కొరకు

| **అహ్‌దీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహ్‌దీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

అల్లాహ్ తఆలా ఆమోదించే స్థితి ఏర్పడెను. తీవ్ర శ్రద్ధ ఏర్పడి, బాధ నా హృదయమును అవహించుకొన్నప్పుడు వాస్తవానికి మృతునిగా మారిన ఆ రోగిపై దుఆ లక్షణములు వెలువడడం మొదలయ్యెను. ఇంతకుముందు అతడు నీటితో భయపడేవాడు, వెలుతురు నుండి దూరము పారిపోయేవాడు కాని అకస్మాత్తుగా ఆరోగ్యములో మార్పులు ఏర్పడి స్వస్థత కలగడం మొదలయ్యెను. ఇప్పుడు నాకు నీటితో భయము కలగడం లేదని అతడనెను. అప్పుడు అతనికి త్రాగు నీరు ఇవ్వగా అతడు నిర్భయంగా త్రాగెను. అనంతరం నీటితో వుజూ చేసుకొని నమాజ్ కూడ చదివెను. రాత్రంతా ప్రశాంతంగా నిద్ర పోయెను. ఇలా భయభ్రాంత స్థితి దూరమయ్యెను. తుదకు కొన్ని రోజులలో అతనికి సంపూర్ణ ఆరోగ్యము కలిగెను. అప్పుడు అల్లాహ్ తఆలా నా మనసులో వెంటనే ఇట్లు ఆలోచన కల్పించబడెను. అతనిలో ఏర్పడిన పిచ్చితనపు స్థితి అతనిని పిచ్చితనముతో చంపుటకు కాక అల్లాహ్ తఆలా సంకేతము వెలువడుటకు ఇలా జరిగెను. పిచ్చి కుక్క కరిసిన తర్వాత అతనిలో పిచ్చితనపు లక్షణములు వెలువడడం మొదలైన తర్వాత ఇంతటి క్లిష్ట పరిస్థితిలో స్వస్థత కలిగి ఆరోగ్యము కుదుట పడడం ఎన్నడు చూడలేదని అనుభవజ్ఞులు అంటుంటారు." (అనుబంధము హఖీఖతుల్ వహీ, రూహాని ఖజాయిన్ సంపుటి 22, పుట 480)

సభికులారా! నేడు వైద్య శాస్త్రము చాలా అభివృద్ది చెంది చికిత్స లేని అనేక వ్యాధులకు చికిత్సను పరిశోధించడం జరిగినది. ప్రస్తుతం పిచ్చి కుక్క కరిసిన తర్వాత ఆంటీ రబ్బీస్ టీకా వేయడంతో వ్యాధి నయం అవుతుంది. కాని వ్యాధి తిరగబడినప్పుడు నేటికి సైతం ఎలాంటి చికిత్స లేదనే విషయము వాస్తవమైనది. కనుక ఈ సంకేతము అల్లాహ్ తఆలా శక్తికి, అతని ఉనికికి ఒక సజీవమైన సాక్ష్యము.

గౌ॥ సభికులారా! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తర్వాత అహ్మదియ్యహ్ జమాఅత్‌లో ప్రవక్తృత్వ విధానములో ఖిలాఫత్ ఏర్పడినది. అహ్మదియ్యహ్ ఖలీఫాలు (ఉత్తరాధికారుల) ద్వారా కూడ అల్లాహ్ తఆలా తన ఉనికికి సాక్ష్యము చూపిస్తున్నాడు. సమయానుసారము ముఖ్యమైన కొన్ని సంఘటనలను ప్రస్తావిస్తున్నాను.

హజ్రత్ మౌలానా నూరుద్దీన్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ హయాంలోని విషయమిది. హజ్రత్ చౌద్రీ హాకీమ్ దీన్ గారు ఖాదియాన్‌లోని బోర్డింగ్ హౌస్‌లో ఒక సాధారణ ఉద్యోగిగా వుండిరి. వారి మొదటి సంతానము సందర్భమున వారి భార్య తీవ్ర అనారోగ్యానికి గురైరి. వారిట్లు తెలిపిరి. మరో దారి లేక నేను రాత్రి పదకొండు గంటలకు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ ఇంటికి చేరుకొని ఇప్పుడు నేను హుజూర్ గారితో భేటీ కాగలనా అని కాపలాదురుణ్ని అడిగితిని. లేదని కాపలాదారుడు సమాధానమిచ్చెను. కాని హుజూర్ నా మాట విని నన్ను లోపలికి పిలిచిరి. నేను భార్య బాధను తెలిపితిని. వారు దుఆ చేసి ఖర్జూరముపై ఊది నాకిస్తు దీనిని తీసుకెళ్లి నీ భార్యకు తినిపించుము, ప్రసవం తర్వాత నాకు కూడ సమాచారము అందించుమని సూచించిరి. హజ్రత్ హాకీమ్ దీన్ ఇట్లు తెలిపిరి. నేను ఆ ఖర్జూరమును నా భార్యకు తినిపించితిని. ఆ ఖర్జూరము మహిమాన్వితంగా ప్రభావము చూపడం మొదలు పెట్టెను. కొద్ది సమయము తర్వాతనే ప్రసవం జరిగెను. రాత్రి పూట హుజూర్ నిద్రిస్తున్నారని భావించి నేను హుజూర్‌ను నిద్ర లేపడం సముచితము కాదని ఊహించితిని. ఉదయం ఫజర్ నమాజ్ తర్వాత హాజరై విషయము మొత్తం విన్నవించుకొంటిని. బదులుగా హుజూర్ ఇట్లనిరి. ప్రసవం తర్వాత మీరు భార్యాభర్తలిద్దరు ప్రశాంతంగా నిద్రపోయిరి. నాకు కూడ సమాచారము అందించినచో నేను కూడ విశ్రాంతి తీసుకొనేవాడిని. నేను రాత్రంతా నీ భార్య కొరకు దుఆ చేస్తూ వుంటిని. ఈ సంఘటన తెలుపుతు హాకీమ్ దీన్ గారు అచేతనంగా రోధించసాగిరి. చప్రాసి అయిన హాకీమ్ దీన్ స్థాయి ఏమిటి, గొప్ప నూరుద్దీన్ స్థాయి ఎక్కడ?

(దిన పత్రిక అల్ ఫజల్ దుఆ సంచిక 28 డిసంబర్ 2015 పుట 43)

అహ్మదియ్య ఉత్తరాధికారుల గొప్పతనమిది. వీరు జమాఅత్ సభ్యుల పట్ల ఎంతో కరుణామయులు, దయామయులు. వారి దుఃఖములను తమ యదలో పెట్టుకొని రాత్రంతా బాధ పడుతు, వారి మేలు, శ్రేయస్సు కొరకు దుఆలు చేస్తుంటారు.

ఇదే మనోభావాలను తెలుపుతు జమాఅత్‌నుద్దేశించి ఒకసారి హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు అన్హు ఇట్లు తెలిపిరి.

"మీ కొరకు ఒక వ్యక్తి మీ బాధలను గ్రహించుచున్నాడు, మిమ్ములను ప్రేమిస్తాడు, మీ దుఃఖమును తమ దుఃఖముగా భావిస్తాడు, మీ కష్టమును తమ కష్టముగా భావిస్తాడు, మీ కొరకు అల్లాహ్ తఆలా ఆస్థానములో దుఆలు చేస్తుంటాడు......అతడు మీ కొరకు తన దేవుని ఆస్థానములో రోధిస్తాడు."

హజ్రత్ సయ్యదహ్ మెహెర్ ఆపా ఇట్లు తెలిపిరి. 1953 సం॥ అల్లర్ల కాలములో కేవలం అహ్మదియ్యత్‌తో గల శత్రుత్వము వలన హజ్రత్ మియాఁ నాసిర్ అహ్మద్ గారు (తృతీయ ఖలీఫా), మిర్జా షరీఫ్ అహ్మద్ గారు రజియల్లాహు అన్హు బంధించబడిరి. రాత్రి భోజనము సమయమున వారిద్దరి ప్రస్తావన వచ్చినప్పుడు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి.

"అల్లాహ్ తఆలా వారిని కరుణించుగాక! వారు ఏ తప్పు చేయలేదనే అపరాధము వలన మాత్రమే వారు బంధించబడిరి. అందుకే నాకు నా అల్లాహ్‌పై సంపూర్ణ నమ్మకమున్నది. వారిని అతడు త్వరలోనే కరుణించును."

వారిట్లు తెలిపిరి. ఇషా నమాజ్ కొరకు వారు (రజి) నిలబడిరి. అప్పుడు దుఆలో ఏర్పడిన రోధన, దుఃఖమును నేను మరచిపోలేను. ఇదే పరిస్థితి తహజ్జుద్ నమాజ్‌లో కూడ వుండెను. పొద్దు ఎక్కిన తర్వాత తపాలా సమయము అయినప్పుడు అందిన మొదటి టెలిగ్రామ్‌లోనే హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ (రజి), మియాఁ నాసిర్ అహ్మద్ గారు విడుదలైనారనే శుభవార్త వుండెను. ఎంత తొందర నా దేవుడు దుఆ ఆమోదపు మహిమ చూపించెను.

(దిన పత్రిక అల్ ఫజల్ దుఆ సంచిక 28 డిసంబర్ 2015 పుట 43)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ కాలములోని విషయమిది. ముహమ్మద్ అమీన్ ఖాలిద్ గారు జర్మనీ నుండి ఇట్లు వ్రాసిరి. నేటికి 45 సం॥ల పూర్వము నా యద ఎముకలో నొప్పి ఏర్పడెను. వివిధ వైద్యులతో చికిత్స చేయించితిని. అన్ని రకాల పరీక్షలు చేయించబడెను. కాని నొప్పిలో ఎలాంటి తగ్గుదల లేకుండెను. వైద్యులు కూడ విధిలేక నాకు చికిత్స లేదని చెప్పిరి. మిగిలి వున్న జీవితము ఈ నొప్పితోనే గడపమని సలహా ఇచ్చిరి. అప్పుడే 1980 సం॥లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాలిస్ హంబర్గ్ పర్యటనకు వచ్చిరి. స్వాగతం కొరకు నేను కూడ వరుసలో నిలబడితిని. కరచాలనం చేస్తూ నేను నా బాధను తెలిపి, దీనికి చికిత్స లేదని, ఈ నొప్పితో నాకు మోక్షము లభించదని వైద్యులు చెప్పిన విషయము కూడ తెలిపితిని. బదులుగా హుజూర్ ఎంతో వైభవంగా ఇట్లనిరి. ఆరోగ్యము లభించదని ఎవరన్నారు. అనంతరం హుజూర్ (రహ్మ) నా చొక్కా గుండిని స్వహస్తాలతో విప్పి, నా యదపై గుండ్రము గీసి ఇక్కడ నొప్పి అవుతుందా అని అడిగిరి. అవును హుజూర్ అని నేను సమాధానిమిచ్చితిని. బదులుగా హుజూర్ ఇట్లనిరి. మనము దుఆ చేయుదుము, స్వస్థత కలుగును. ఇన్‌షాఅల్లాహ్. బాధ పడకండి. అనంతరం అమీన్ గారిట్లు తెలిపిరి. ఈ సంఘటన జరిగి 35 సంవత్సరములు గడిచి పోయినవి. ఆ నాటి నుండి నేటి వరకు ఆ నొప్పి నాకు మరెప్పుడు కలుగలేదు.

శక్తితో తన ఉనికికి సత్యమైన సాక్ష్యము ఇస్తాడు
కనిపించని అతని ప్రత్యక్ష రూపం ఇదే

గౌ॥ సభికులారా! హజ్రత్ ఖలీఫతుల్ మసీహిర్రాబె రహిమహుల్లాహ్ దుఆ ఆమోద విశ్వాసభరితమైన ఒక సంఘటన ఇట్లు గలదు. పశ్చిమ ఆఫ్రీకా నగరము ఘానాకు చెందిన ఒక చీఫ్ నానా ఓజీఫో గారు మతపరంగా క్రైస్తవులు. అపనమ్మకాలను విశ్వసించే జాతీయులు. వారి భార్య గర్భం ప్రతిసారి పడిపోయేది. వారు క్రైస్తవ పాద్రీలు, మంత్రాలు చదివే వారిని ఆశ్రయించారు. కాని ఎలాంటి లాభము కలుగలేదు. ప్రతి చోట వారికి నిరాశయే ఎదురైనప్పుడు చివరికి అహ్మదియ్యహ్ జమాఅత్ ఇమామ్ ఇబ్దుల్ వహాబ్ ఆదమ్ గారిని ఆశ్రయించి, ఇట్లనిరి. నేను క్రైస్తవుడనే, కాని దుఆ విషయములో నాకు క్రైసత్వ మతంపై నమ్మకము సడలినది. మీ దుఆలను దేవుడు ఆమోదిస్తాడని నేను విన్నాను. మీరు నా తరపున పరిస్థితులన్నిటిని వ్రాసి మీ ఇమామ్‌కు దుఆ చేయాలని పంపండి. కావున వహాబ్ ఆదమ్ గారు వారి ఉత్తరమును హుజూర్ గారికి పంపిరి. అనంతరం వారి భార్య గర్భము దాల్చిరి. ఇప్పుడు ఈ పాప మరణించడమే కాక భార్య కూడ మరణించును. (12వ పేజిలో చదవండి)

(7వ పేజి తరువాత) కావున మీరు ఈ గర్భమును తొలగించుకోండని వైద్యులు చెప్పిరి. ఆ చీఫ్ గారిట్లు బదులిచ్చిరి. ఎన్నటికి అలా చేయను. నా భార్యకు ఎలాంటి నష్టము కలుగదు, నా పాపకు కూడ ఎటువంటి నష్టము వాటిల్లదని నాకు ఇమామ్ అహ్మదియ్యహ్ జమాఅత్ ఉత్తరము వచ్చినది. అనంతరం అల్లాహ్ తఆలా వారికి చాలా అందమైన, ఆరోగ్యవంతమైన బాలుణ్ణి ప్రసాదించెను. వారి భార్య కూడ మంచి ఆరోగ్యముతో వుండిరి. దుఆ ఆమోదపు ఈ సంఘటనను చూసి వారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిర్రాబె పవిత్ర హస్తమున బైఅత్ చేసిరి.

అసాధ్యమును సుసాధ్యము చేయును ఈ దుఆ

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 17 - JUL 2025, Issue No - 29.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

ఓ నా తత్వజ్ఞానులారా! దుఆ శక్తిని చూడండి

చివరలో నేను మన ప్రియతమ ఇమామ్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారి దుఆ ఆమోద సంఘటనను ప్రస్తావించెదను. హుజూర్ 2004 సం॥లో ఘానాలో పర్యటించిరి. అప్పుడు ఒక సందర్భమున ప్రయాణములో వుండగా ఘానా భూభాగంలో చమురు వెలువడునని ఘానాకు శుభవార్త అందించిరి. కనుక 2008వ సం॥లో హుజూరె అన్వర్ ఖిలాఫత్ జూబ్లీ వేడుకలలో భాగంగా మరల ఘానాలో పర్యటించినప్పుడు ఘానా జాతీయ అధ్యక్షుడు భేటీలో హుజూర్‌తో ఇట్లనిరి. మా దేశము కొరకు మీ దుఆలు ఆమోదించబడు తున్నాయి. ఘానా భూభాగంలో చమురు వున్నది, ఇక్కడ చమురు వెలువడునని హుజూర్ గత పర్యటనలో చెప్పివుంటిరి. హుజూర్ గారి ఈ దుఆ ఎంతో గొప్పగా పూర్తి అయినది. గత సంవత్సరం ఘానాలో చమురు వెలువడినది. ఈ విషయమును ఘానాలోని ప్రఖ్యాత జాతీయ పత్రిక Daily Graphic తన 17 ఏప్రిల్ 2008వ సంచికలో మొదటి పుటలో హుజూరె అన్వర్ మరియు ఘానా అధ్యక్షుని భేటి నివేదికను ప్రచురిస్తు ఇట్లు వ్రాసెను. ఖలీఫతుల్ మసీహ్ తమ ఘానా పర్యటన 2004 సందర్భమున ఘానా నుండి చమురు వెలువడునని చాలా గట్టి నమ్మకముతో చెప్పియుంటిరి. ఇదే నమ్మకము గత సంవత్సరం పూర్తి అయినది. ఘానా భూభాగంలో చమురు వెలువడినది.

(దిన పత్రిక అల్ ఫజల్ దుఆ సంచిక 28 డిసంబర్ 2015)

గౌ॥ సభికులారా! నేను సమయ భావము వలన ఉదాహరణగా దుఆ ఆమోదపు కొన్ని సంఘటనలను మాత్రమే ప్రస్తావించాను. వాస్తవానికి ఈ అంశము గురించి అనన్య విశ్వాసభరిత సంఘటనలు వున్నాయి. వాటితో ఒక పెద్ద పుస్తకము రచించవచ్చును. కావున దుఆ ఆమోద సంఘటనలు వైభవోపేతుడైన దేవుని ఉనికికి ప్రత్యక్ష సాక్ష్యములగును. దీనిని పొందుటకు నిష్టాపరత, పవిత్రత, నిరాడంబరత, వినయము చాలా అవసరము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి.

ఆ పవిత్రునితో మనసు పెట్టుకున్న వ్యక్తి
తనను పవిత్రునిగా మార్చుకున్నప్పుడే అతనిని పొందును.
మట్టిలో కలిసిన వానికే దేవుడు లభించును.
ఓ పరీక్షించువాడా ఈ ఉపాయమును కూడ పరీక్షించి చూడు.

ఇలాగే వారు అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి.

"మేము దుఆ ద్వారా ముందస్తుగానే అల్లాహ్ తఆలాతో తెలుసుకుంటాము. ఎంతగా నమ్మకము పెరిగి పోయినదనగా మేము దేవుణ్ణి వీక్షించెదము......ఈ దుఆ ద్వారనే దేవుడు గుర్తింపబడుతాడు, వేలాది తెరల వెనుక వున్న ఆ వైభవోపేతుడైన దేవుని ఉనికి గురించి తెలుస్తుంది." (అయ్యాముస్సులహ్: పుట 9-10)

వ ఆఖిరు దావానా అనిల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్

---

మన అల్లాహ్‌యే మన స్వర్గము . మన సర్వానందములు మన అల్లాహ్ యందే గలవు. ఎందుకనగా మేమతనిని తిలకించితిమి. అందములన్నియు అతనిలో పొందితిమి. ఈ సంపత్తిని ప్రాణాలర్పించైన కొనుగోలు చేయవచ్చును. సర్వస్వము ధారపోసైన ఈ ముత్యమును కొనవచ్చును. ఓ దురదృష్టవంతులారా! ఈ చెలిమ వైపు పరుగెత్తుము, ఇదియే మీ దాహము తీర్చును. ఇది జీవనమిచ్చు చెలిమ, ఇదియే మిమ్ము రక్షించును. నేనేమి చేయవలయును?, ఈ శుభవార్తను ప్రజల హృదయాలలో నాటుటకు నేను ఏ విధానమును ఎంచుకోవలెను?. ఇతడే మీ అల్లాహ్! అని ప్రజలు ఆలకించుటకు, తెలుసుకొనుటకు నేను ఏ విధముగా చాటింపవలెను?. ప్రజలు ఆసక్తితో వినుటకు నేను వారి చెవులకు ఏ విధమైన చికిత్స చేయవలెను?. ఒకవేళ మీరు అల్లాహ్‌కు అంకితమైనచో నిశ్చయముగా అల్లాహ్ కూడ మీవాడగునని భావించుము.........అల్లాహ్ ఒక ప్రియమైన నిధి. అడుగడున మీకతడు సహాయపడును. అతడు లేనిది మీరు లేరు. (కిస్తియే నూహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 19, పుట 26-27, ప్రచురణ రబ్వా)

"సజీవమైన, సర్వస్థితికి కారణుడైన మన దేవుడు మానవుని వలె మాట్లాడుతాడు. మనము ఒక విషయము అడిగి, దుఆ చేసినప్పుడు అతడు శక్తివంతమైన మాటలతో సమాధానము ఇస్తాడు. ఈ పరంపర వెయ్యి సార్లు కొనసాగినను అతడు జవాబు ఇవ్వడానికి వెనుకడుగు వేయడు. అతడు తన వాక్యములో చిత్ర విచిత్ర విషయములను వెల్లడిస్తాడు. మహిమాన్వితమైన శక్తుల దృశ్యములను ప్రదర్శిస్తాడు. తుదకు దేవుడు అనదగు ఉనికి తానే అని నమ్మకము కలిగిస్తాడు. దుఆలను ఆమోదిస్తాడు. ఆమోదించిన విషయాన్ని కూడ తెలియపర్చుతాడు. పెద్ద పెద్ద సమస్యలను తీర్చుతాడు. మృతుల వలే పడి ఉన్న రోగులను కూడ అత్యధిక దుఆలతో సజీవుల వలే స్వస్థత పర్చుతాడు. పైగా ఈ విషయాలన్నింటిని తన వాక్యముల ద్వారా సమయానికి ముందే తెల్పుతుంటాడు. దేవుడు అంటే అతడే. మన దేవుడు భవిష్యవాణులతో నిండిన తన వాక్యముల ద్వారా తానే ఈ భూమ్యాకాశములకు దేవుడు అని నిరూపించుకుంటాడు. అట్టి దేవుడే నన్ను ఉద్దేశించి ఈ విధముగా అన్నాడు: నేను నిన్ను తావూన్ మహమ్మారి నుండి కాపాడుతాను. ఇలాంటి దైవవాణిని ప్రచురించిన నాలాంటి మరొక వ్యక్తి ఈ భూమండలంపై ఎవరైన ఉన్నారా?. తన ఇంటి నాలుగు గోడల మధ్య ఉండే తన కోసం, తన భార్య పిల్లల కోసం, ఇతర సత్కార్యములను ఆచరించు వారి కోసం దేవుడు తానుగా బాధ్యత తీసుకున్నట్లుగా బహిర్గతం చేశాడా?."

(నసీమె దావత్, పుట 82 రూహాని ఖజాయిన్ సంపుటి 19,)

నేను ఎల్లప్పుడు ఆశ్చర్యదృష్టితో చూస్తూంటాను, ఈ అరబ్బి ప్రవక్త, వీరి నామము ముహమ్మద్ (స.అస).(వారిపై వేల వేల దురూద్‌లు, శుభములు) ఎంతటి ప్రతిభావంతుడైన ప్రవక్త. వారిలో గల ప్రతిభపు చివరి స్థాయి అంతు చిక్కడంలేదు. మరియు వారి సామర్ధ్యముల ప్రభావంను అంచన వేయడం ఏ మానవునికి సాధ్యము కాదు. విచారకరము! వారి ప్రతిష్ఠతను గుర్తించవలసిన విధముగా గుర్తించలేకపోయిరి. ప్రపంచములో కనుమరుగైన దైవారాధనను కేవలం ఆ శూరుడొక్కడే మరల ప్రపంచమునకు తెచ్చి దానిని స్థాపించెను. వారు దేవునిని అనంతస్థాయి వరకు పూజించెను. మరియు మానవ శ్రేయస్సు కొరకు అశేషంగా తమ ప్రాణాలను అడ్డుగా వేసిరి. అందుకే వారి హృదయ ఆంతర్యమును తెలుసుకున్న అల్లాహ్ తాలా ప్రవక్తలందరిపైన, పూర్వీకులందరిపైన, చివరులందరిపైన వారికే అధిక ప్రాధాన్యత నిచ్చెను. అంతేగాకా వారి ఆశయాలన్నింటిని వారి జీవితంలోనే పూర్తిగావించెను. అనుగ్రహాములన్నింటికి వారు ఒక్కరే మూలాధారము, వారి ఘనతను స్వీకరించకుండానే ఏవరైన ఏదైన ఘనతను గూర్చి వాగ్దానం చేసినచో అట్టి వ్యక్తి మానవుడు కాకుండ షైతాన్ సంతానమగును. ఎందుకనగా అన్ని రకాల ఘనతలు వారికి మాత్రమే ప్రత్యేకించబడినాయి. మరియు అన్ని రకాల వివేకముల సంపధంతయు వారికే సమర్పించ బడినది. వారి నుండి ఆ సంపధను పొందనివారు సదా దురదృష్ఠవంతులు, వారి ఎదుట మనము ఎంతటి వారము, వారి స్థాయి ముందు మన స్థాయి ఎంతటిది. ఆ ప్రవక్త నుండే మనము స్వచ్ఛమైన దైవారాధనను పొందినామని ఒకవేళ అంగీకరించనిచో మనము ఆ అదృష్ఠమును తిరస్కరించినవారము అగుదుము. అంతర్యామి అయిన పరమాత్ముని ఆనవాళ్ళను కూడ మనము ఈ సందేశహారుని ద్వారానే, వారి తెజస్సు ద్వారానే తెలుసుకొంటిమి. మరియు దేవుని సంభాషణలను, సత్యస్వప్నాలను వేటిద్వార మనకు అతని రూపం కనిపించునో వాటిని కూడ మనము ఈ పూజ్యునీయులైన ప్రవక్త ద్వారనే పొందినాము. ఆ విశిష్ఠమార్గదర్శకుడి వెలుగులు సూర్యకిరణాల వలే మనపై విరజిమ్మును. ఆ వెలుగులకు భిన్నముగా నిలిచి ఉన్నంత వరకు మనము కూడ ప్రకాశించగలము.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz